PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 49 | విజయవాడ, గురువారం 19 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 19 September 2024 | Rs

రోహిత్, గంభీర్‌లకు పరీక్ష

- సర్ఫరాజ్, జురెల్ బెంచ్‌కే పరిమితం
- నేటినుంచి బంగ్లాదేశ్‌తో తొలిటెస్ట్ ఉదయం 9.30గంII నుంచి

8

నేటి నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్‌పర్సన్, సెట్ కన్వీనరు పి ఉమామహేశ్వరి బుధవారం ప్రకటించారు. ఈ నెల 19 నుంచి 21 వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 20 నుంచి 22 వరకు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ 23 నుంచి 25 వరకు ఉంటుందన్నారు. ఆప్షన్లు మార్చుకునేందుకు 26న అవకాశం ఉంటుందని తెలిపారు. సీట్ల కేటాయింపు 28న ఉంటుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఐసెట్ బి-ఫార్మసీ అడ్మిషన్లు

ఐసెట్ అర్హత సాధించిన అభ్యర్థులకు బి ఫార్మసీ రెండో సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానుందని ఇ సెట్ అడ్మిషన్ల కన్వీనరు జి గణేష్ కుమార్ తెలిపారు. గురు, శుక్రవారాల్లో అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- 2029 నుంచే అమలు! • రాజ్యాంగ సవరణలు తప్పనిసరి
- పదవీకాలానికి ముందే రద్దవనున్న పలు రాష్ట్ర అసెంబ్లీలు
- రాజ్యాంగం, సమాఖ్య వ్యవస్థపై మరో దాడి : సిపిఎం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగంపైన, భారత దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపైన కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరోసారి దాడికి దిగింది. అధికార కేంద్రీకరణకు దారితీసే జమిలి ఎన్నికలకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోద ముద్ర వేసింది. బిజెపి ముందుగా నిర్ణయించుకున్నదానికి అనుగుణంగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ పార్లమెంటుకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరపాలంటూ చేసిన సిఫారసులను బుధవారం మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులతో మాట్లాడుతూ, జమిలీ ఎన్నికలకు విస్తృత మద్దతు లభించిందని, వీటిని రెండు దశలలో నిర్వహిస్తామని చెప్పారు. తొలిదశలో లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని అన్నారు.

ఒక దేశం ఒకే ఎన్నికకు అనుకూలంగా కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది ప్రజాస్వామ్యంపైన, ఫెడరలిజంపైన, దేశ ప్రజల సార్వభౌమత్వంపైన తలపెట్టిన దాడి అని పార్టీ తన ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్‌లో విమర్శించింది. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న ఈ యత్నాన్ని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చింది.

లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత 100 రోజులలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు చేసింది. ఈ సిఫారసులను అమలు చేసే విషయాన్ని పరిశీలించేందుకు ఓ గ్రూపును ఏర్పాటు చేయాలని కూడా ఆ కమిటీ సూచించింది. జమిలి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ సవరణ అవసరమవుతుంది. ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందాలంటే పార్లమెంటు ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు తప్పనిసరి.పార్లమెంటు, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ఈ రాజ్యాంగ సవరణను పార్లమెంటు ఆమోదించాక ఇక రాష్ట్రాలు ఆమోదం అవసరం ఉండదు.

కానీ, జమిలి ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత దేశ వ్యాపితంగా ఒకేసారి నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రాజ్యాంగ సవరణను మాత్రం సగానికిపైగా రాష్ట్రాల శాసన సభల ఆమోదం అవసరమవుతుంది. లోక్‌సభ ఎన్నికలలో కేవలం 240 స్థానాలు మాత్రమే గెలుచుకున్న బిజెపి మెజారిటీ కోసం మిత్రపక్షాలైన జెడియు, టిడిపి, లోక్ జనశక్తి పార్టీల మద్దతుపై ఆధారపడాల్సి వచ్చింది. కాగా జమిలి ఎన్నికలకు ఈ పార్టీలు మద్దతు ఇస్తాయా లేదా అనే అనుమానాలు తలెత్తుతుండగా.. ఈ మూడు పార్టీలు జమిలీ ఎన్నికల ప్రతిపాదనను సమర్ధించాయని బిజెపి వర్గాలు చెబుతున్నాయి. 2029లో జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే దీనికి మిగతా 7లో

రూ.99కే నాణ్యమైన మద్యం

- అక్టోబర్ ఒకటి నుండి రాష్ట్రంలో నూతన విధానం • కేబినెట్ ఆమోదం
- భూ యజమాని సంతకం లేకుండానే సిసిఆర్‌సి కార్డు • రెండున్నరేళ్లలో పోలవరం డయాఫ్రమ్ వాల్
- ఆధార్ తరహాలో విద్యార్థులకు ఆపార్ కార్డులు • భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 99 రూపాయలకే నాణ్యమైన మద్యంను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో నూతన మద్య విధానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా వంద రూపాయల్లోపే నాణ్యమైన మద్యం అందిస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీపై చర్చ జరిగింది. అనంతరం 99 రూపాయలకు అందచేయాలని నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఈ విషయం తెలిపారు. అయితే, 99 రూపాయలకు ఎంత మద్యం ఇవ్వనున్నారన్న విషయమై స్పష్టత లేదు. ఈ విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సూటిగా సమాధానం ఇవ్వలేదు. నూతన మద్యం పాలసీలో నిర్వహణ, ఆదాయ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మద్యం అమ్మకాల కోసం ప్రైవేట్-రిటైల్ విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ళ కాలపరిమితికి నూతన విధానం అమలు చేయాలని, రిటైలర భాగస్వామ్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని నిర్ణయించారు. షాపుల కేటాయింపులో 10శాతం గీత కులాలకు కేటాయించాలని మంత్రి మండలి తీర్మానించింది. రిజర్వుడ్‌షాపులకు ప్రత్యేక మార్గదర్శకాలు, నోటిఫికేషన్లు జారీచేయనున్నారు. అన్ రిజర్వుడ్ షాపుల్లో ప్రతిపాదిత శ్లాబుల్లో 50శాతం లైసెన్స్ ఫీజు ఉండనుంది. భూ యజమాని సంతకం లేకుండానే సిసిఆర్‌సి (క్రాప్ట్ కల్టివేషన్ రైట్ కార్డు)ను రానున్న రబీ సీజన్ నుంచి ఇవ్వాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఇప్పటి వరకు ఈ కార్డులు రెవెన్యూ అధికారుల సంతకంతో ఇస్తుండగా, ఇకపైన మండల వ్యవసాయాధికారుల సంతకం చేయనున్నారు.

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయించారు. శాసనసభ, శాసనమండలి ఆమోదం తెలిపిన అనంతరం తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు సిఫార్సు చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మాణ బాధ్యతలను సిడబ్ల్యుసి సూచనలతో పాత ఏజెన్సీకే ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. డయాఫ్రమ్ వాల్ రెండు, రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని , ఇందు కోసం కేంద్రం మంజూరు చేసిన రూ.12వేల కోట్లను వినియోగించుకోవాలన్న ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించింది. రాయలసీమలో సాగునీటి సమస్య రాకుండా ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను ఈ సీజన్‌లో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని జలవనరులశాఖను సిఎం ఆదేశించారు. ఆధార్ తరహాలో విద్యార్థులకు "అపార్" గుర్తింపు కార్డులివ్వాలని, మాజీసైనికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుతో, పునరావాసానికి సొంతపిడిఎఫ్ ఖాతానుంచి రూ.3కోట్లు కార్పస్ నిధితో ఎపి ఎక్స్‌సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎసిఎక్స్‌సిఎ) ఏర్పాటుతో పాటు రూ.10కోట్లు కార్పస్ ఫండ్ మంజూరు చేయాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామచ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నెలకు రూ.200 చొప్పున ఓ మీడియాసంస్థకు ఆర్థిక సహాయం అందించేందుకు జీఓఆర్‌డి నెంబరు 6ను రద్దు చేస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి ఏడాదికి రూ.205కోట్లు నష్టంకలిగిందని, దీనిపై కమిటీ వేయడంతో పాటు వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని సిఎం ఆదేశించారు.

స్టెమీతో ప్రజల ఆరోగ్య పరిరక్షణ:

ఎస్టీ ఎలివేషన్‌మయో కార్డియల్ ఇన్ఫ్రాక్షన్ (స్టెమీ) కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కమ్యూనిటీ స్థాయిలో సమగ్ర క్యాన్సర్‌స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహించేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో (ఆర్‌బిఎస్‌కె) భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

వేగుచుక్క ఏచూరి..

సీతారాం సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, నెల్లూరు ప్రతినిధి

దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి వేగుచుక్కని పలువురు వక్తలు కొనియాడారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభలు బుధవారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలోనూ, నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలోనూ జరిగాయి.ఈ సభల్లో మాట్లాడిన మాట్లాడిన వక్తలు మతోన్మాదంపై ఏచూరి చేసిన పోరాటాన్ని, ఆయన ముందుకు తీసుకువచ్చిన ప్రత్యామ్నాయ రాజకీయాలను, వాటిలోకి యువతను నడిపించిన తీరును గుర్తుచేసుకున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి. వి. శ్రీనివాసరావు ఈ సభల్లో మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో విలువలు కలిగిన నెంబర్ వన్ వ్యక్తి ఏచూరి అని చెప్పారు. నైతిక విలువల కోసం అనునిత్యం పాటుపడ్డారని అన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఆయన దిక్సూచి అని చెప్పారు. మేధోశక్తి కలిగిన రాజకీయ నాయకుల్లో ఆయన ఒకరని కొనియాడారు. ప్రపంచ కమ్యూనిస్టు నాయకులను ప్రభావితం చేసిన వ్యక్తి అని, సంకీర్ణ రాజకీయాలను నడిపేందుకు అన్ని పార్టీలను ఏకతాటిపైన నిలిపిన వ్యక్తి ఏచూరి అని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ఆయన తనకు తెలుసని, 1985 నుంచి ప్రత్యక్షంగా ఆయనతోపాటు జాతీయ రాజకీయాల్లో నడిచానని గుర్తు చేసుకున్నారు. ఏచూరి మరణంతో కమ్యూనిస్టు శ్రేణులు నిరాశ చెందకుండా, ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

తిరుపతిలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

తిరుపతిలో ...

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి అధ్యక్షతన బుధవారం జరిగింది. తొలుత ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఏచూరి తీవ్రమైన పోరాటం చేశారని తెలిపారు. అభ్యుదయ ఉద్యమాలు బలోపేతం కావాలని, అందుకు సీతారాం ఏచూరిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.మాజీ ఎంఎల్‌సి మిగతా 7లో

సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో

22న సీతారాం ఏచూరి సంతాప సభ

3

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం ఉధృతం

- విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక పిలుపు
- అఖిల పక్ష కార్మిక సంఘాన్ని ఢిల్లీకి పంపండి
- సెయిల్‌లో విలీనం చేయండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రైవేటీకరించే కుట్రలను ప్రతిఘటించేందుకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక పిలుపునిచ్చింది. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక నాయకులు బుధవారం సమావేశం అయ్యారు. వేదిక కన్వీనరు వి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, ఐఎఫ్‌టియు నాయకులు పొలారి మాట్లాడారు. పొమ్మనకుండా పొగబెట్టేలా విశాఖ స్టీల్ పరిశ్రమ నడక సాగుతోందని విమర్శించారు. పరిశ్రమకు కావాల్సిన ముడి పదార్థాలైన బొగ్గు, ఇనుము సొంత ఖనిజాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే రెండు సెక్షన్లు మూతపడ్డాయని, మరో సెక్షన్ కూడా మూతపడేందుకు సిద్ధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ప్రైవేటీకరణకు పూర్తిగా సహకరిస్తున్నాయని విమర్శించారు. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజకీయాల్లోకి రాకముందు నుండే కార్మిక సంఘాలు వున్నాయనే అంశాన్ని జనసేన నేతలు గుర్తించుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కార్మిక సంఘాల ప్రతినిధులు ఎప్పుడు కలిసినా ఎవరి పని వారిదేనని, కార్మిక సంఘాలు తమ పనిని తాము చేసుకోవచ్చని, ప్రభుత్వాలు తమ పని తాము చేస్తాయని, ప్రైవేటీకరణను సమర్థించినట్లుగా మాట్లాడటం తగదని అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన అంశాలను గుర్తు చేసుకోవాలన్నారు. ఇపుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణను సమర్ధించేలా మాట్లాడటం తగదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నిజాయతీని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల్ని ఢిల్లీకి ప్రతినిధి బృందంగా పంపాలని కోరారు. కార్మిక ఉద్యమాలను ఆపటం ఎవరి తరం కాదన్నారు. కార్మికులకు పోరాటం తప్ప మరోమార్గం లేదన్నారు. విశాఖ స్టీల్ పరిరక్షణ కోసం దశలవారీ పోరాటాలను, ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. అక్టోబరు 2న కార్మిక సంఘాలు, అక్టోబరు 3 రైతు సంఘాలు, అక్టోబరు 4 అన్ని ప్రజా సంఘాలు తమ ఆందోళనలను విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం చేపడతాయని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంటును స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ప్రైవేటీకరణ చేయబోమని హామీ ఇచ్చి, ఇప్పుడు దొడ్డిదోవన ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ 120 శాతంతో రూ.945 కోట్లు లాభాల్లో ఉందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేటీకరణ చేయటం బిజెపి లక్ష్యంగా పెట్టుకుందని, ఈ విధానాలను ప్రతిఘటించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఏపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, వేదిక నాయకులు వెలగపూడి అజాద్, ఎం వెంకటరెడ్డి, కొల్లా రాజమోహన్, యు వీరబాబు, టియుసిఐ రాష్ట్ర కన్వీనరు మరీదు ప్రసాద్ బాబు, టిఎన్‌టిసి నాయకులు ఆర్ శ్యామ్, రిటైర్డు ఐఎఎస్ బి శ్రీనివాసులు, భారత్ బచావో నాయకులు మాసియాంగ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వి ఉమామహేశ్వరరావు

జమ్మూకాశ్మీర్ తొలి దశలో 59% పోలింగ్

శ్రీనగర్, జమ్ము: సుమారు 10 ఏళ్ల తరువాత జరుగుతున్న జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బుధవారం తొలి దశ ప్రశాంతంగా ముగిసింది. తొలి దశలో 59 శాతం పోలింగ్ నమోదయిందని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పికె పోల్ తెలిపారు. ఇది రాష్ట్రంలో గతంలో జరిగిన ఏడు ఎన్నికల కంటే అధికమని చెప్పారు. అయితే ఈ పోలింగ్ శాతం తాత్కాలికమేనని, అన్ని ప్రాంతాల నుంచి నివేదికలు వచ్చిన తరువాత ఈ పోలింగ్ శాతం పెరిగే అవకాశ ఉందని తెలిపారు. బుధవారం తొలి దశలో భాగంగా ఏడు జిల్లాల్లో 24 స్థానాల్లో పోలింగ్ నిర్వహించారు. ఎన్నిల సంఘం వివరాల ప్రకారం ఇందర్వాల్‌లో అత్యధికంగా 80.06 శాతం పోలింగ్ నమోదైంది. తరువాత పద్దర్-నాగ్సేని స్థానంలో 76.80 శాతం,, కిష్త్వార్‌లో 75.04 శాతం, దోడా వెస్ట్‌లో 74.14 శాతం నమోదయింది. అలాగే, కాశ్మీర్ లోయలో అత్యధికంగా పహల్గామ్ స్థానంలో 67.86 శాతం పోలింగ్ నమోదైంది. తరువాత డిహెచ్ పోరాలో 65.21 శాతం,, కుల్గామ్‌లో 59.58 శాతం, కోకెర్‌నాగ్‌లో 58 శాతం, దూరులో 57.90 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే త్రాల్ నియోజకవర్గంలో అత్యల్పంగా 40.58 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. పుల్వామా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ తక్కువ పోలింగ్ నమోదయిందని చెప్పారు. తొలి దశ జరిగిన 24 స్థానాల్లోనూ మొత్తం దాదాపు 23 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 219 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో 90 మంది స్వతంత్ర్య అభ్యర్థులు ఉన్నారు. జమ్మూకాశ్మీర్‌లో 10 ఏళ్ల తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటం, అలాగే 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత జమ్మూకాశ్మీర్ అసెంబ్లీకి జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలపై దేశం దృష్టి ఉంది. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండో దశ ఈ నెల 25న జరగనుంది. జమ్మూకాశ్మీర్‌లో తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా జరిగినందుకు, పోలింగ్‌లో భాగస్వామ్యైనందుకు ఓటర్లకు ఎన్నికల కమిషన్ కృతజ్ఞతలు తెలిపింది.



పుల్వామాలోని ఒక పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి సిరాచుక్క చూపిస్తున్న ఓటరు

కొవ్వాడపై ముందుకే!

- భూ సేకరణ సిబ్బంది కొనసాగింపు
- జిఓ విడుదల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజల నుండి వ్యతిరేకత వస్తున్నా కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రంపై పాలకుల వైఖరి మారడం లేదు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి అనుగుణంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఆ దిశలోనే రాష్ట్ర ప్రభుత్వం మరో చర్య తీసుకుంది. అణు విద్యుత్ కేంద్రం భూ సేకరణ కోసం ప్రత్యేకంగా నియమించుకున్న సిబ్బందిని మరో ఏడాది పాటు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థికశాఖ బుధవారం 92వ నెంబర్ జిఓను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రెగ్యులర్ పోస్టుల్లో ఉన్న పది మందితో పాటు, అవుట్‌సోర్సింగ్‌లో ఉన్న 28 మంది 2025 మార్చి 31వ తేది వరకు ఉద్యోగాల్లో కొనసాగనున్నారు.

వైసిపికి బాలినేని రాజీనామా

- నేడు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో భేటీ

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం పంపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న బాలినేని విజయవాడకు వస్తున్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌తో గురువారం భేటీ కానున్నారు. జనసేనలో చేరేందుకు దాదాపుగా రంగం సిద్ధం చేసుకున్నారు. రాజకీయాలు వేరు, బంధుత్వాలు వేరని, వైఎస్‌ఆర్ కుటుంబానికి సన్నిహితుడినైనా జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ నిర్ణయాలు సరిగా లేనప్పుడు కచ్చితంగా అడ్డుకున్నానని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. బాలినేని రాజీనామాతో వైసిపి అధినాయకత్వం అప్రమత్తమైంది. ఆయనతో ఇంకా పార్టీని ఎవరెవరు వీడతారనే సమాచారం సేకరణలో ఉంది. బాలినేని రాజీనామా జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చగా మారింది.

శ్రీశైలానికి పొంచి ఉన్న ముప్పు

- ప్లంజ్‌పూల్ ప్రమాదకరమని చెబుతున్న నిపుణులు
- నిధులివ్వకుండా కొర్రీలు పెడుతున్న కేంద్రం

3

భారీ నష్టానికి అనుగుణంగా

వరద బాధితులకు పరిహారం, ప్యాకేజీ పెంచండి

సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదల వలన నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ప్యాకేజీ ఏమాత్రమూ సరిపోదని, భారీ నష్టానికనుగుణంగా దానిని పెంచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బుడమేరు, కృష్ణా ఇతర వరదల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో దాదాపు పది రోజులు పాటు ఇళ్లు నీటిలోనే ఉండి పోయాయని, దీంతోబాధితులు సర్వస్వం కోల్పోయారని ఈ ప్రకటనలో సిపిఎం తెలిపింది. "భారీ ఆస్తినష్టం జరిగింది. చిరు వ్యాపారులు మొదలు, చిన్న పరిశ్రమల వరకు తీవ్రంగా నష్టపోయారు. ఉపాధి పోయింది. ప్రతి కుటుంబంమూ మంచాలు, బట్టలు, టివిలు ఫ్రిజ్‌లు, వాహనాలు ఇతర గహోపకరణాలు యావత్తు కోల్పోయింది. కొన్ని ఇళ్లు పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రతి కుటుంబానికి లక్షలాది రూపాయల ఆస్తినష్టం జరిగిందని వివరించారు. చేతివత్తులు, వ్యాపారం, పరిశ్రమలకు కోట్లాది రూపాయల నష్టం జరిగింది. ఇది జీవితాంతం కోలుకోలేని నష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, ప్యాకేజీ రిగిన నష్టానికికి అనుగుణంగా సరిపడే విధంగా లేదు' అని సిపిఎం పేర్కొంది.

ప్రతి కుటుంబానికి కనీసం రూ. 50 వేలు

ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి రూ.50 వేలు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని ప్రకటనలో వి.శ్రీనివాసరావు కోరారు. మోటార్ వాహనాలకు పదివేలు, ఆటోలకి 25 వేల రూపాయలు తగ్గకుండా ఇవ్వాలని పేర్కొన్నారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు ఐదు లక్షలు, పాక్షికంగా దెబ్బ తిన్న ఇళ్లకు రెండు లక్షల రూపాయలు సహాయం చేయాలని, చిరు వ్యాపారులకు ఇచ్చే 25 వేల రూపాయల పరిహారం ఏమాత్రమూ సరిపోదని, కనీసం లక్ష రూపాయలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇతర వ్యాపారాలు, పరిశ్రమలకు జరిగిన నష్టానికి అనుగుణంగా పరిహారం ఇవ్వాలని, వాహనాలు ఇతర ఇన్సూరెన్స్‌లపై కంపెనీలు నష్టానికి అనుగుణంగా బాధితులకు పరిహారం చెల్లించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తగు సహాయం అందే విధంగా చూడాలని కోరారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు.

కేంద్ర వైఖరి శోచనీయం

రూ.10 వేల కోట్లకుపైగా నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందానికి నివేదిక ఇచ్చినా ఇప్పటి వరకు కేంద్రం నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమని శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు వందలాది కోట్ల రూపాయలు విరాళాల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందించడం హర్షణీయమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలని కోరారు. బాధితులకు పరిహారం పెంచాలని, అన్ని విధాల ఆదుకోవాలని, సాధారణ ప్యాకేజీతో పాటు వివిధ తరగతులు, సంస్థలు, కుటుంబాలకు జరిగిన నష్టానికి అనుగుణంగా సహాయం అందించాలని డిమాండు చేశారు.

పంటల పరిహారమూ చాలదు

వరదల వల్ల నష్టపోయిన పంటలకు ప్రకటించిన నష్టపరిహారమూ సరిపోదని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో వరి, పసుపు, కంద, కూరగాయలు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అరటి, చెరుకు లాంటి పంటలు సగం నుండి మూడొంతులకు పైగా నష్టపోయాయని పేర్కొన్నారు. వరి పంటకు రైతులు ఇప్పటికే 30 వేల నుండి 35 వేల రూపాయలు పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. కందకు రెండు లక్షలకు పైగా పసుపుకు లక్షన్నరకు పైగా పెట్టుబడులు పెట్టారని, మిగిలిన వాణిజ్య పంటలన్నిటికీ లక్షల్లోనే అందిన ప్రతి చోటా అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారని వివరించారు. దీనికి తోడు కౌలు రైతులు, డబ్బులు కొంత మంది ముందే చెల్లించారని వివరించారు. మరికొంత మంది చెల్లించాల్సి ఉందని చెప్పారు. పంటలు ఇంత తీవ్రంగా దెబ్బతింటే ప్రభుత్వం వరి పంటకు ఎకరాకు రూ.10 వేలు, కంద, పసుపు లాంటి వాణిజ్య పంటకు ఎకరానికి రూ.14 వేలు ప్రకటించడం అన్యాయమని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నష్టపరిహారం పాడైపోయిన భూములను బాగుచేసుకుని తిరిగి పంటలు వేసుకోవడానికి యోగ్యంగా మార్చుకోవడానికి మాత్రమే ఈ నష్టపరిహారం సరిపోతుందని వివరించారు. పెట్టిన పెట్టుబడులు తెచ్చిన అప్పుల నుండి బయటపడటానికి ఇది ఏ మాత్రమూ సరిపోదని వివరించారు. కాబట్టి వరికి ఎకరానికి రూ 25 వేలు, వాణిజ్య పంటలకు పెట్టిన పెట్టుబడిని బట్టి లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం కౌలు రైతులకే ఇస్తామని ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామని, ఆచరణలో అమలు జరగడం లేదని వివరించారు. భూ యజమానుల అనుమతితోనే ఈ పంట నమోదు చేస్తున్నారని, అంటే ముఖ్యమంత్రి మాటలు అమలుపై అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. పంట నమోదుతో సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతి రైతు, కౌలు రైతుకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని, చేనేత సహా పలు వృత్తిదారులకూ పరిహారం పెంచాలని కోరారు. గేదె, ఎద్దులు ఇతర పశవులకు ప్రకటించిన నష్టపరిహారం కూడా సరిపోదని పేర్కొన్నారు. వాటి మీద ఆధారపడి జీవిస్తున్న పేదవాళ్లకు ఈ పరిహారం తిరిగి వారు కోలుకోడానికి సరిపోదని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాలను మార్చి న్యాయంగా రైతులు పెట్టిన పెట్టబడులను బట్టి నష్టపరిహారం మొత్తాన్ని పెంచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

విజయవాడ వాంబేకాలనీలో భోజనం కోసం బారులుతీరిన వరద బాధితులు

కడుపు నింపిన ఆహార పంపిణీ కేంద్రాలు

- సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజాశక్తి - విజయవాడ

బుడమేరు వరద బాధితులకు సిపిఎం, ప్రజా సంఘాలు అండగా నిలిచాయి. ఆహార పంపిణీ కేంద్రాల ద్వారా వేలాది మంది బాధితుల కడుపు నింపాయి. సిపిఎం అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య స్మారకార్థం విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈ నెల 6వ తేదీ నుండి నిర్వహించిన 10 ఆహార పంపిణీ కేంద్రాల్లో ప్రస్తుతం రెండు కేంద్రాలు కొనసాగుతున్నాయి. బుధవారం కండ్రిక కేంద్రంలో 2 వేల మందికి, జక్కంపూడి కేంద్రంలో 1,300 మందికి భోజనం అందించారు. జక్కంపూడి ఆహార పంపిణీ కేంద్రం బుధవారంతో ముగిసింది. నగరంలోని మొత్తం పది కేంద్రాల్లో 1.30 లక్షల మందికిపైగా భోజనం అందజేశారు. ప్రజలకు అండగా తామున్నామని సిపిఎం, ఎంబి విజ్ఞాన కేంద్రం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు తదితర ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు రేయింబవళ్లు కష్టించి ఆపన్న హస్తంగా నిలిచారు. ఈ నెల 1వ తేదీ నుండి వరద బాధితులకు వివిధ రూపాల్లో సేవలందిస్తూనే ఉన్నారు. అనేక మంది దాతలు రాజకీయాలకతీతంగా ముందుకొచ్చి పలు రూపాల్లో సహాయ సహకారాలు అందించి ఆహార పంపిణీ కేంద్రాలను విజయవంతంగా నిర్వహించడానికి తోడ్పాటునందించారు. పైపుల రోడ్డు సెంటర్, వాంబే కాలనీ, సింగ్‌నగర్ (కృష్ణా హోటల్ సెంటర్), న్యూ రాజరాజేశ్వరీపేట, రాజీవ్ నగర్, రాధానగర్, శాంతినగర్, కండ్రిక, వైఎస్ఆర్ జక్కంపూడి కాలనీ, మొగల్రాజపురం (సున్నంబట్టీల సెంటర్‌లోని కెవిపిఎస్ కార్యాలయం)లో బాధితులకు పెద్దఎత్తున ఆహారం పంపిణీ చేశారు. వాంబేకాలనీ, ఆర్ఆర్‌పేట, పైపులరోడ్డులో నిర్వహించిన ఒక్కో సెంటరులోనే రోజుకు ఐదు వేల మందికిపైగా భోజనం అందించారు. వరద బాధితులతోపాటు పోలీసులు, పారిశుధ్య కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది సైతం ఆయా కేంద్రాల్లో భోజనం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు తదితరులు ఈ కేంద్రాలను పర్యవేక్షించారు.

పి4 పేరిట వైద్య కళాశాలల ప్రయివేటీకరణ గర్హనీయం

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యకళాశాలల నిర్మాణాలు నిలిపేసి పబ్లిక్ ప్రయివేటు పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి4) విధానంలో నిర్మించాలని ఆలోచన చేయడం గర్హనీయమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. దీనిపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం నిర్ణయం వల్ల ఈ విద్యా సంవత్సరం రాష్ట్రానికి రావాల్సిన మెడికల్ సీట్లలో 700 సీట్లు విద్యార్థులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. పులివెందుల కళాశాలకు 50 సీట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం కళాశాలకు వసతులు కల్పించలేమని ఎన్ఎంసి లేఖ రాయడం శోచనీయమన్నారు. నూతనంగా ప్రారంభించిన 17 కళాశాలల్లో ఐదు కళాశాలలు గత విద్యా సంవత్సరం ప్రారంభించారని, ఈ విద్యా సంవత్సరం మరో ఐదు కళాశాలలు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభం కావాలని, కానీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ ఆలోచనను వెనక్కు తీసుకుని పూర్తిగా ప్రభుత్వ ఆదీనంలో నిర్మాణాలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్సింగ్, ఎన్ఆర్ఐ సీట్లకు అవకాశం కల్పిస్తూ తెచ్చిన జిఓ నెంబరు 107,108లను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే జిఓలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సైబర్ సెల్ స్టేషన్లు

- ప్రతి జిల్లాలో నార్కోటిక్ స్టేషన్ ఏర్పాటు : డిజిపి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ సెల్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశామని డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. హోంగార్డు నుంచి పోలీసు అధికారి వరకు ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీగా పని చేసేలా సన్నద్ధం చేస్తున్నామన్నారు. సినీనటి కేసు విషయంలో ఇప్పటికే ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశామని, వారిపై ప్రాథమిక విచారణ కొనసాగుతోందని తెలిపారు. నేరం చేసిన వారు ఎంతటి వారైనా ఒకేలా దర్యాప్తు చేసేలా సిబ్బందికి ఆదేశాలిస్తున్నామన్నారు. ఏలూరు రేంజ్ పోలీసు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం రేంజ్ పరిధిలోని ఏలూరు, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, రాజమండ్రి అర్బన్, కాకినాడ, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల ఎస్‌పిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో డిజిపి మాట్లాడారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టేందుకు ప్రత్యేక నార్కోటిక్ విభాగానికి ప్రతిపాదనలు చేశామని, డిజి, ఐజి స్థాయి అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాకు ఒక నార్కోటిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్హతలకు అనుగుణంగా పోలీసు శాఖలో ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నామని, ఫింగర్‌ప్రింట్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కొత్త ప్రణాళిక తీసుకొస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌హెచ్‌ఒలకు రావాల్సిన కార్యాలయ ఖర్చుల సొమ్ము వారివారి ఖాతాలకు త్వరలోనే జమ చేయనున్నామని చెప్పారు. అద్దె భవనాల్లోని పోలీస్ స్టేషన్లకు సొంత భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

కార్యకర్తలకు అండగా నాయకులు

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాలు, అక్రమాలు ఎక్కువ అయ్యాయని, నాయకులంతా కార్యకర్తలకు అందుబాటులో వుంటూ వారికి అండగా నిలవాలని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం నెల్లూరు, పల్నాడు జిల్లాల ముఖ్య నాయకులతో జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై నాయకులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అన్ని రంగాల్లో విఫలం చెందిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అటకెక్కించారని ఆరోపించారు. ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందని విమర్శించారు.

వరద బాధితులకు చిన్నారి సాయం

వరద బాధితులకు అండగా నేనున్నానంటూ పులివెందులకు చెందిన చిన్నారి వర్ణిక ముందుకొచ్చింది. తను దాచుకున్న పాకెట్ మనీ రూ.72,500ను వరద బాధితుల కోసం వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి అందజేసింది. తన బాబాయి జి ప్రణీత్‌కుమార్‌తో కలిసి వచ్చి వరద బాధితుల కోసం సాయం అందజేసింది.

3 జిల్లాలకు అధ్యక్షులు నియామకం

పల్నాడు, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు నూతన అధ్యక్షులను వైసిపి నియమించింది. నెల్లూరు జిల్లాకు కాకాని గోవర్ధన్‌రెడ్డి, పల్నాడు జిల్లాకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పశ్చిమగోదావరి జిల్లాకు ముదునూరి ప్రసాదరాజును నియమించింది. అలాగే కందుకూరు అసెంబ్లీ సమన్వయకర్తగా కాకాని గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటి ఇన్‌ఛార్జిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్‌కు ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు కార్పొరేషన్‌కు మాజీ మంత్రి పి అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఖలీల్ అహ్మద్‌ను నియమించినట్లు వైసిపి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

వరదల్లో పనిచేసిన కార్మికులను పట్టించుకోరేం?

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరద ప్రాంతాల్లో 10 నుంచి 12 రోజులు అర్ధాకలితో అవస్థలు పడుతూ వరద ముంపు బాధితులకు సేవలందించిన మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, నాయకులు జ్యోతిబసు, ముత్యాలరావు, చిన్న తదితరులు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, డైరెక్టరు హరినారాయణన్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. వరద బాధితులకు సేవలందించిన మున్సిపల్, పారిశుధ్యం, కోవిడ్ కార్మికులు, డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్‌లు ఇతర సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనంతో కూడిన ఐదు రోజుల సెలవు ఇవ్వాలని కోరారు. నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని, వైద్య పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన మున్సిపల్ కార్మికులకు రూ.25 వేలు ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనికి స్పందించిన డైరెక్టరు హరినాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండు జతల దుస్తులు ఇవ్వాలని నిర్ణయించామని, ఆర్థిక సాయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనారోగ్యానికి పాలైన కార్మికులకు అవసరాన్ని బట్టి సెలవులు ఇచ్చి ఆదుకుంటామని హామీనిచ్చారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్.షర్మిల

బిజెపి అనుచిత వ్యాఖ్యలపై షర్మిల నిరసన

ప్రజాశక్తి- వన్‌టౌన్ (విజయవాడ)

రాహుల్ గాంధీపై అనుచిత వాఖ్యలు చేసిన బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో బిజెపి, శివసేన ఎంఎల్‌ఎ గైక్వాడ్... రాహుల్ గాంధీ నాలుక కోసి తీసుకొచ్చిన వారికి రూ.11 లక్షలు ఇస్తామని ప్రకటించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు బుధవారం విజయవాడ వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ పార్లమెంట్లో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతని గుర్తు చేశారు. ఆయనను చంపాలని కొందరు బిజెపి నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. ఇంత దారుణంగా విమర్శలు చేస్తున్నా ప్రధాని మోడీ, అమిత్ షా నోరుమెదపకపోవడం శోచనీయమన్నారు. బిజెపి నేతల వ్యాఖ్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు, అత్యాచారాలు 15 నుంచి 32 శాతానికి పెరిగాయన్నారు. వీటికి బిజెపి నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలేవి?

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి
- బాధిత మహిళకు పరామర్శ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళిత గోవిందమ్మను పరామర్శిస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రమాల్యాద్రి

కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో సామాజిక హింసకు పాల్పడిన అందరిపైనా కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం డిమాండ్ చేశారు. ఆధిపత్య కులాల చేతిలో దాడికి గురైన దళిత మహిళను ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం పరామర్శించారు. ఆమెపై దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత మహిళపై దాడి చేసిన ప్రాంతాన్ని కలెక్టర్, ఎస్‌పి సందర్శించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఆరు నెలల క్రితం దళిత కులానికి చెందిన ఈరన్న రజక కులానికి చెందిన అమ్మాయిని కులాంతర వివాహం చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 12న ఈరన్న తల్లి గ్రామానికి రావడాన్ని జీర్ణించుకోలేక విద్యుత్ స్తంభానికి కట్టేసి అమ్మాయి తరపు వారంతా విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. ఆధిపత్య శక్తులు తెలుగు కృష్ణమూర్తి, బోయ చిలకళడోన లక్ష్మన్న, తెలుగు నరసప్ప, బోయ బసవరాజు, తెలుగు ఎర్రన్న, నర్సింగప్ప, లచ్చుమారి తిక్కప్ప, చిలకళడోన దేవేంద్ర, బోయ నాగేంద్ర, చిన్న నాగేంద్ర, మరో 20 మంది ఘటనలో ప్రత్యక్షంగా భాగస్వామ్యమైనా వారిపై కేసు నమోదు చేయలేదని తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న అందరిపైనా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు ప్రత్యేక భద్రతతో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

వినాయక నిమజ్జనంలో ఉద్రిక్తత

- చెన్నూరులో ఇరు గ్రూపుల ఘర్షణ

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, పెడన

కృష్ణా జిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామంలో బుధవారం గణేష్ నిమజ్జన ఊరేగింపులో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసు బందోబస్తు మధ్య విగ్రహ నిమజ్జనం చేయాల్సి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి చెన్నూరు గ్రామంలోని దళితవాడుకు చెందిన కొందరు అంబేద్కర్ పాటతో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తూ గ్రామానికి తీసుకువచ్చారు. అగ్రవర్ణానికి చెందిన కొందరు పెత్తందార్లు అంబేద్కర్ పాట పెట్టడంపై అభ్యంతరం తెలిపారు. వెంటనే పాటను నిలిపివేయాలని పట్టుబట్టారు. దళితవాడకు చెందిన వారు దీనికి అంగీకరించకపోవడంతో వివాదం చోటుచేసుకుంది. పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరు గ్రూపుల వారిని చెదరగొట్టారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఇరు గ్రూపులకు చెందిన వారు పోలీసు స్టేషన్‌లో రాజీపడ్డారు. తిరిగి గ్రామానికి వచ్చి పోలీసు బందోబస్తు మధ్య దళితవాడకు చెందిన వారు విగ్రహ ఊరేగింపునకు ప్రయత్నించారు. గ్రామంలో కొందరు ఊరేగింపును అడ్డుకోవడంతో బుధవారం రాత్రి మరోసారి వివాదం ఏర్పడింది. ఎఆర్ ఎఎస్‌పి టివిడి.ప్రసాద్, పెడన నాగేంద్రప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పర్యవేక్షణలో విగ్రహ ఊరేగింపు కొనసాగింది. గ్రామంలో ఘర్షణలు తలెత్తకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయండి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
- ప్రిన్సిపల్ సెక్రటరీకి యూనియన్ వినతి
- సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్వాడీలు 42 రోజులు సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలు, మినిట్స్ కాపీ ఆధారంగా పెండింగ్లో ఉన్న జిఓలు ఇవ్వాలని, అంగన్వ్వాడీ యూనియన్లను చర్చలకు పిలిచి వేతనాలు పెంచాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు బుధవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబీరాణి, కె సుబ్బరావమ్మ, నాయకులు జ్యోతి రత్నకుమారి... స్త్రీ శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఓ ఇవ్వాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చుల కింద రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమ్మెకాలంలో చనిపోయిన వారికి కూడా ఇది అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె కాలంలో పెట్టిన కేసులు రద్దు చేయాలని, ఫోన్లలో ఉన్న నాలుగు యాప్‌లను ఒకే యాప్‌గా మార్చాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లలో నిర్దిష్ట గైడ్‌లైన్స్ అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవు కనీసం మూడు నెలలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సెంటర్లలో ఇబ్బందులు పరిష్కరించాలి

అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణలో వస్తున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ మహిళలు రికార్డులు సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. గుంటూరు జిల్లాలో హెల్పర్ల ప్రమోషన్లకు ఇంటర్వ్యూలు జరిగి ఆరు నెలలు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రమోషన్లు ఇవ్వాలని, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ప్రమోషన్లకు ఎమ్మెల్యే సంతకాలు కావాలని, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సర్పంచుల సంతకాలు కావాలని వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. సత్యసాయి, కడప, ఏలూరు జిల్లాల్లో నాలుగు నెలల నుంచి కందిపప్పు లేదని, కూరగాయలకు అదనపు ఖర్చు అవుతోందని, కొన్ని జిల్లాల్లో ఆయిల్ సరఫరా లేదని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లకు కందిపప్పు ఇవ్వాలని కోరారు. అన్నమయ్య జిల్లాలో కెమెరాలు తప్పకుండా ఉండాలని చెబుతున్నారని, నెట్ పనిచేయకపోడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీన్ని రద్దు చేయాలని కోరారు. గర్భిణులకు సీమంతాలు, పోషకాహార వారోత్సవాలకు రూ.250 చొప్పున కేటాయిస్తున్నారని, సరిపోవడం లేదని, అదనంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ పెద్దయెత్తున సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. బిఎల్ఓ డ్యూటీలు వేశారని, పెండింగ్ ఉన్న టిఎ, అద్దె బిల్లులు కూడా ఇవ్వాలన్నారు. అలాగే కొన్ని జిల్లాల్లో టిడిపి నాయకులు అధికారుల మీద ఒత్తిడి తెచ్చి మెమోలు ఇప్పిస్తున్నారని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు.

ప్రతి అంగన్‌వాడీ సెంటర్ నుండి రూ.100

వరదల్లో నష్టపోయిన ప్రజానీకం సహాయార్థం ప్రతి అంగన్‌వాడీ సెంటర్ నుండి రూ.100 చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు చెక్కును అందజేయడానికి అనుమతి ఇవ్వాలని యూనియన్ నాయకులు ప్రిన్సిపల్ సెక్రటరీని కోరారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించే కుట్ర

- మాజీ మంత్రి విడుదల రజని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు టిడిపి కూటమి నేతలు కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి విడదల రజని ఆరోపించారు. గుంటూరులోని తన నివాసంలో బుధవారం మీడియాతో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 17 మెడికల్ కళాశాలలో ఐదింటిని గత ప్రభుత్వం పూర్తి చేసిందని, మిగతా వాటిని పూర్తి చేయాల్సిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆ పని చేయకుండా గందరగోళం సృష్టిస్తోందన్నారు. పులివెందుల కళాశాలకు కేటాయించిన మెడికల్ సీట్లను వెనక్కి ఇచ్చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ఆన్‌లైన్ మోసానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు బలి

- సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సయ్యద్ ఖలీల్ అహ్మద్

నంద్యాల పట్టణంలో ఆన్‌లైన్ మోసానికి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బలైపోయారు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మి మోసపోయారు. సెల్ఫీ వీడియో తీస్తూ ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల పట్టణంలోని సలీమ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఖలీల్ అహ్మద్ (40) అవుకు మండలం సంగపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ముంబయికి చెందిన వెబెక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఓ ఆన్‌లైన్ మోసగాడు అహ్మద్‌కు చెప్పాడు. ఆయన నిజమని నమ్మి రూ. ఏడు లక్షల వరకు ఆన్‌లైన్‌లో చెల్లించారు. ఆన్‌లైన్ మోసగాడు మళ్లీ ఖలీల్ అహ్మద్‌కు ఫోన్ చేసి ప్రస్తుతం కంపెనీ నష్టాల్లో ఉందని, ఐటి దాడులు జరుగుతున్నాయని, మరింత అమౌంట్ పంపాలని పదేపదే ఒత్తిడి చేశాడు. తాను మోసపోయానని తెలుసుకొని ఆ ఒత్తిడిని తట్టుకోలేక సెల్ఫీ వీడియో తీస్తూ తన ఇంట్లోనే మంగళవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉపాధ్యాయుడి ఆత్మహత్య చేయనుకున్నారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సిఐ ఇస్మాయిల్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అహ్మద్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు విచారణ చేస్తున్నట్లు సిఐ ఇస్మాయిల్ తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు అలోచించి పెట్టాలన్నారు. సైబర్ కేటుగాళ్లు, ఆన్‌లైన్ మోసగాళ్ల చేతిలో పడి మోసపోవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వరదల్లో నష్టపోయిన రైతుల కౌలు రద్దు చేయాలి

- ఎపి రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్
- వరి, కంద నష్టపరిహారాన్ని పెంచాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బుడమేరు, కృష్ణానది వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో వడ్లుగానీ, కంద, పసుపు వంటి పంటను ఇంటికి తెచ్చుకునే పరిస్థితి లేదని, నష్టపోయిన పంటలకు కౌలు వెంటనే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే ముఖ్యమంత్రి ప్రకటించిన నష్టపరిహారం ఏ మాత్రమూ సరిపోదని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో వరి, పసుపు, కంద, కూరగాయలు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అరటి, చెరకు వంటి పంటలు సగం నుండి మూడు వంతులకు పైగా నష్టపోయాయని తెలిపారు. వరి పంటలకు రైతులు ఇప్పటికే రూ.30 వేల నుండి రూ.35 వేలు పెట్టుబడి పెట్టారని అన్నారు. కందకు రెండు లక్షలకుపైగా, పసుపునకు లక్షన్నరకుపైగా పెట్టుబడులు పెట్టారని పేర్కొన్నారు. ప్రతి వాణిజ్య పంటకు అందినచోటల్లా లక్షల్లో పెట్టుబడులు పెట్టారని తెలిపారు. దీనికితోడు కౌలు రైతులు కొంతమంది ముందే కౌలు చెల్లించారని పేర్కొన్నారు. పంటలు ఇంత తీవ్రంగా దెబ్బతింటే ప్రభుత్వం వరి పంటకు ఎకరాకు రూ.పదివేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.14 వేలు ప్రకటించడం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ పరిహారం పాడైన భూములను బాగు చేసుకునేందుకే సరిపోతుందని పేర్కొన్నారు. పెట్టుబడులు, అప్పుల నుండి బయటపడేందుకు ఇది సరిపోదన్నారు. వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు పెట్టిన పెట్టుబడిని లక్ష రూపాయలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని కౌలు రైతులకే ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని వారు స్వాగతించారు. కానీ ఆచరణలో అమలు జరగడం లేదని పేర్కొన్నారు. భూ యజమానుల అనుమతితోనూ ఈ పంట నమోదు చేస్తున్నారని వివరించారు. ఈ పంట నమోదుతో సంబంధం లేకుండా ప్రతి రైతు, కౌలు రైతుకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. వరదల వల్ల ఆయిల్ ఇంజిన్లు, మోటార్లు నీటిలో మునిగి పూర్తిగా పాడైపోయాయని పేర్కొన్నారు. గేదె, ఎద్దులు, ఇతర పశువులకు ప్రకటించిన నష్టపరిహారం కూడా ఏ మాత్రమూ సరిపోదని తెలిపారు. వాటికి కూడా నష్టపరిహారాన్ని ప్రకటించాలని, వాటిమీద ఆధారపడి జీవిస్తున్న పేదవారికి తిరిగి వారు కోలుకోవడానికి కూడా సరిపోదని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాలను మార్చి, న్యాయంగా రైతులు పెట్టిన పెట్టుబడులను బట్టి నష్టపరిహారం పెంచాలని కోరారు. కౌలు రైతుల కౌలును రద్దు చేయాలని, ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాలు కౌలు రైతులకే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీశైలానికి పొంచి ఉన్న ముప్పు

- ప్లంజ్‌పూల్ ప్రమాదకరమని చెబుతున్న నిపుణులు
- నిధులివ్వకుండా కొర్రీలు పెడుతున్న కేంద్రం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉభయ తెలుగు రాష్ట్రాలకు సాగు, తాగునీటి అవసరాలతో పాటు విద్యుత్తును అందిస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు శ్రీశైలం ప్రమాదంలో పడింది. డ్యాం గేట్లు ఎత్తినప్పుడు వరద ప్రవాహ తీవ్రతకు దిగువ భాగంలో ఏర్పడిన భారీ గొయ్యి (ప్లంజ్‌పూల్) ఇంజనీర్లను ఆందోళనకు గురిచేస్తోంది. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. మళ్లీ ఆ స్థాయి వరద వస్తే డ్యాం తట్టుకోగలదా..? ప్లంజ్‌పూల్‌లో గొయ్యి వల్ల ప్రాజెక్టు భద్రతకు ముప్పు పొంచి ఉందా..? అనే సందేహాలు ప్రజానీకం నుంచి వ్యక్తమవుతున్నాయి.

2009 నాటి వరదలకు ప్రాజెక్టు అన్ని గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. ఆ సమయంలో వరద ఉధృతికి మూడో గేటు నుంచి ఎనిమిదో గేటు మధ్య భారీగొయ్యి ఏర్పడింది. ఆనకట్ట సహా కుడి, ఎడమ గట్లు ఏ మేరకు దెబ్బతిన్నాయో తెలుసుకునేందుకు చాలా కమిటీలు అధ్యయనం చేశాయి. మరమ్మతులకు సూచనలు చేస్తూ నివేదికలు సైతం ఇచ్చాయి. శ్రీశైలం సహా వివిధ ప్రాజెక్టుల భద్రతా, నిర్వహణ లోపాలను సమీక్షించేందుకు కేంద్ర జలవనరుల శాఖ 2014 సెప్టెంబరు 23న ఆయా రాష్ట్రాల ఇంజనీరింగ్ నిపుణులతో సమావేశం

శ్రీశైలం డ్యాం దిగువన ఏర్పడిన భారీ గొయ్యి

నిర్వహించింది. శ్రీశైలం భద్రతపై అధ్యయనం కోసం అప్పటి జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఇంజనీర్లతో నిపుణుల కమిటీని నియమించింది. ఈ కమిటీ అదే ఏడాది అక్టోబరు 28న ప్రాజెక్టును పరిశీలించి డ్యాం భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై నివేదికనిచ్చింది.

2017 జులై 13న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకె మూర్తి నేతృత్వంలోని కమిటీ, 2018 జూన్ 11, 12న జలవనరుల శాఖ రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ (ఇఎన్‌సి) పి.రామరాజు, రిటైర్డ్ సిఇ కె.సత్యనారాయణ, రిటైర్డ్ ఇఇ కె.కృష్ణతో కూడిన కమిటీ, 2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, డ్యాం భద్రతా నిపుణులు ఎబి పాండ్యా నాయకత్వంలో కేంద్ర నిపుణుల కమిటీ డ్యాంను పరిశీలించాయి. అన్ని కమిటీలు ప్లంజ్‌పూల్ వల్ల డ్యాంకు ముప్పుపొంచి ఉందని నివేదికలు ఇచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 8న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) చైర్మన్ వివేక్ త్రిపాఠి నాయకత్వంలో ఎన్‌డిఎస్‌ఎ సభ్యులు, కేంద్ర జలసంఘం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, సెంట్రల్ సాయిల్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సిఎస్‌ఎంఆర్‌ఎస్) నిపుణులు, ఎపి, తెలంగాణ ఇంజనీర్ల కమిటీ సభ్యులు శ్రీశైలం జలాశయాన్ని సందర్శించారు. భారీ గొయ్యి 45 మీటర్ల లోతు, 270 మీటర్లు వెడల్పు, 400 మీటర్లు పొడవు ఉంటుందని అంచనా వేశారు. ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గొయ్యి వల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండు వైపులా ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇప్పటికే నష్టం జరిగిన ప్రొటెక్షన్ సిలిండర్స్ రిహాబిటేషన్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కుడి, ఎడమ గట్లకు నష్టం జరగకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించింది.

ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల కోసం 'డ్యాం రిహాబిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' (డ్రిప్-2) కింద రూ.139 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్లు గతంలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు ఇవ్వకపోగా కేంద్రం పలు కొర్రీలు పెట్టింది. మరోసారి రూ.190 కోట్లతో మరో ప్రతిపాదన పంపిస్తే దానిని కూడా ఆమోదించలేదు. వివిధ నిపుణుల కమిటీల సిఫారసుల మేరకు డ్యాం భద్రతకు రూ.203 కోట్లు నిధులు కావాలని అధికారులు తాజాగా మరో ప్రతిపాదనను కేంద్రానికి పంపారు. ఈసారి కేంద్రం కొర్రీలు పెడుతుందో, నిధులు ఇస్తుందో వేచి చూడాలి. డ్రిప్-2 కింద నిధులు ఇప్పించడంతో పాటు గోతిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని సాగునీటి నిపుణులు, రైతులు కోరుతున్నారు.

22న సీతారాం ఏచూరి సంతాప సభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యాన సెప్టెంబరు 22 (ఆదివారం)న విజయవాడలో జరగనుంది. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం అవుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సభలో పార్టీ కేంద్ర నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు విజయవాడ నగర ప్రముఖులు, ప్రజారంగాల నాయకులు పాల్గొని నివాళు లర్పించనున్నారని తెలిపారు.

చింతూరులో ర్యాలీ చేస్తున్న గ్రామ వాలంటీర్లు

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల ర్యాలీ

- చింతూరు ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి-చింతూరు (అల్లూరి జిల్లా)

ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన వలంటీర్లు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అల్లూరి జిల్లా చింతూరులోని శ్యామల వెంకటరెడ్డి భవనం (సిపిఎం కార్యాలయం) నుంచి ఐటిడిఎ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, చింతూరు వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత వలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు అమలు చేయాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాజీనామా చేసిన వలంటీర్లను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదలు, కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వలంటీర్లు సేవలందించారని గుర్తు చేశారు. వలంటీర్ల వినతిపై ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ స్పందిస్తూ వలంటీర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ధర్నాలో ఎపి గ్రామ వార్డు వలంటీర్ల యూనియన్ (సిఐటియు) నాయకులు, విఆర్.పురం, కూనవరం, ఎటపాకకు చెందిన వలంటీర్లు పాల్గొన్నారు.

డెంగీతో వివాహిత మృతి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి(కాకినాడ జిల్లా)

డెంగీతో వివాహిత మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. అమీనాబాద్ గ్రామానికి చెందిన ఉమ్మిడి కృపా (20) వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం పిఠాపురంలోని ఓ ఆస్పత్రిలో చేరారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ అపోలో ఆస్పత్రికి తరలించారు. డెంగీగా వైద్యులు నిర్ధారించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి మరణించారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-రేగిడి (విజయనగరం జిల్లా)

బిటెక్‌లో ఉత్తీర్ణత కాలేదని మనస్తాపంతో ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విజయనగరం జిల్లా రేగిడి మండలంలో మంగళవారం రాత్రి బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన గోగుల యోగేశ్వరరావు (20) రాజాంలోని జిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో యోగేశ్వరరావు ఉత్తీర్ణత సాధించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ అభ్యర్థులు మోకాళ్లపై నిలబడి నిరసన

నారా లోకేష్ హామీని నిలబెట్టుకోవాలి : డివైఎఫ్ఐ

- కలెక్టరేట్ ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థులతో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పోలీస్ కానిస్టేబుల్ నియామకాలను అధికారంలోకి రాగానే వంద రోజుల్లోగా ప్రక్రియను పూర్తి చేస్తామని నారా లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట బుధవారం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు మోకాళ్లపై నిలబడి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు జిల్లా పరిషత్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నిరసన వద్దే ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ చిరంజీవికి డివైఎఫ్ఐ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి నగేష్, నిరుద్యోగులు నాయక్, నాగార్జున మాట్లాడారు. నవంబర్ 2022లో గత ప్రభుత్వం 6100 పోస్టులకు పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఆ సమయంలో హోంగార్డ్స్ రిజర్వేషన్స్ ఎపిఎస్‌పిలో ఎనిమిది నుండి 15 శాతం సివిల్ 15 నుండి 25 శాతం పెంచడం వల్ల ఆ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోలీస్ బోర్డు హైకోర్టుకు వెళ్లిందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కోర్టు కేసును పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఫిజికల్ ఈవెంట్స్ మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించి డిసెంబర్‌లోపు పోస్టింగులు ఇవ్వాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు రంగప్ప, న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బాష, ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, నాయకులు ఆర్యన్, ఖాజాబాష, నిరుద్యోగులు నాగార్జున, ప్రవీణ్, దాగూర్ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

టిడిపిలోకి పశ్చిమగోదావరి జెడ్‌పి చైర్‌పర్సన్ దంపతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపిలో చేరిన ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాద్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ టిడిపి గూటికి చేరారు. దీంతో వైసిపికి మరో భారీ షాక్ తగిలింది. టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు నేతృత్వంలో బుధవారం అమరావతి ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఆయన స్వగృహంలో టిడిపిలో చేరారు. పద్మశ్రీతో పాటు ఆమె భర్త వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు, నేతలు పామర్తి అచ్యుత్‌గౌడ్, ఇ అశోక్, ఎస్ కిషోర్, ఎస్ మురళీ, రెడ్డి కిషోర్ టిడిపిలో చేరారు. వీరందరికీ పసుపు కండువాలు కప్పి మంత్రి లోకేష్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. పద్మశ్రీ పెదపాడు జెడ్‌పిటిసి సభ్యులుగా వైసిపి తరపున గెలుపొంది జెడ్‌పి చైర్‌పర్సన్ బాధ్యతలు చేపట్టారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు పద్మశ్రీ దంపతుల మధ్య కొన్ని అభిప్రాయ భేదాలు ఉండేవి. వీరిని చింతమనేని స్వాగతిస్తారా, లేదా అనేది ప్రజల్లో సందేహం ఉంది.

వరద బాధితులకు సిపిఎం, సిఐటియు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు)

రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇంతటి విపత్తును చవిచూడాల్సి వచ్చిందని, వరద బాధితులను తక్షణమే ఆదుకునేలా నష్టపరిహారం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు కోరారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలం మణుగూరులో వరద బాధితులకు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డ్రెయిన్ల ఆధునీకరణ చేపట్టి ఉంటే సమస్య తీవ్రత తగ్గి ఉండేదన్నారు. కొల్లేరు ముంపు నివారణకు వివిధ కమిటీలు పలు సిఫార్సులు చేశాయని, గత 30 ఏళ్లుగా వాటి అమలుకు ప్రయత్నించిన దాఖలాల్లేవని విమర్శించారు. బుడమేరులో ఆక్రమణలు తొలగించకపోవడం వల్ల విజయవాడ నీట మునిగిందని, ప్రజలు నానావస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

వరద బాధితులకు సాయమందిస్తున్న సీతారాం, నాగేశ్వరరావు, నేతలు

మాట్లాడుతూ.. నీట మునిగిన ప్రతి ఇంటికీ రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని కోరారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు పెదపాడు మండలం గోగుంట ఎస్‌సి కాలనీలోనూ, వేలేరుపాడు మండలంలోనూ సిఐటియు ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ జంగం సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడికి విద్యార్థుల తల్లిదండ్రులు దేహశుద్ధి చేసిన ఘటన బాపట్ల జిల్లా చీరాల పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసింది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం మండలం కొత్తపేటకు చెందిన ఓ టీచర్ చీరాల పట్టణంలోని ఓ ప్రయివేటు స్కూల్లో 6, 7 తరగతులకు లెక్కల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఓ వైపు విద్యార్థులకు పాఠాలు చెబుతూనే మరోవైపు విద్యార్థినుల పట్ల వెకిలిచేష్టలకు పాల్పడుతున్నాడు. టచ్ చేయకూడని చోట టచ్ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడు. సుమారు ఎనిమిది మంది బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని సమాచారం. విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. అయితే యాజమాన్యం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదు.

ఈ నేపథ్యంలో మంగళవారం కారంచేడుకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు చీరాల కొత్తపేటలోని లెక్కల టీచర్ ఇంటికి వెళ్లి ఆయనను చితకబాదారు. అనంతరం ఇంటి దగ్గర నుంచి పాఠశాల వరకు ఆ లెక్కల మాస్టారును తీసుకొచ్చి అక్కడ కూడా దేహశుద్ధి చేశారు. జరిగిన విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేద్దామని తల్లిదండ్రులు భావించినప్పటికీ సదరు టీచర్ మీద చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్, కరస్పాండెంట్ తల్లిదండ్రులకు ఇచ్చిన హామీలతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

వేర్వేరు చోట్ల 130 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో అక్రమంగా తరలిస్తున్న 130 కిలోల గంజాయిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని, వీరి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గంజాయి నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అల్లూరి జిల్లా చింతూరులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ వాహనంలో వంద కిలోల గంజాయిని గుర్తించారు. ఒడిశాలోని కూర్మనూరు నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్ రతీలాల్ కోలీ, ఆకాశ్ విలాస్ చవాన్‌ను అరెస్టు చేశారు.

అనకాపల్లి జిల్లా సబ్బవరంలో పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

అనకాపల్లి జిల్లా సబ్బవరం మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ జంక్షన్‌లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో తరలిస్తున్న 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం నుంచి విశాఖపట్నానికి ఆటోలో 15 ప్యాకెట్‌లు (ఒక్కొక్కటి రెండు కిలోలు) తరలిస్తుండగా, ఆటోకు పైలట్‌గా ఇద్దరు పల్సర్ బైక్‌పై వస్తున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేయడగా ఆటోలో గంజాయిని ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ లోగా బైక్‌పై వచ్చిన వారిలో ఒకరు పరారయ్యారు. ఆటో డ్రైవర్‌తోపాటు ఆటోలో ఉన్న వ్యక్తిని, బైక్‌పై ఉన్న మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆటో, పల్సర్ బైక్, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముంచంగిపుట్టు మండలం గూడెం మాలిపుట్ గ్రామానికి చెందిన గుడియ సురేష్ (24), కొండగూడ గ్రామానికి చెందిన కిముడు మోహన్‌దాస్ (21), రామాపుట్ గ్రామానికి చెందిన ముక్కి లోహిదాస్ (29)లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మట్టం శ్రీనివాసరావు ప్రధాన నిందితునిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌జియుకెటి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అమరేంద్రకుమార్

ఏలూరు జిల్లా నూజివీడు ఆర్‌జియుకెటి (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) క్యాంపస్ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా, క్యాంపస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా అమరేంద్ర కుమార్ సంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ ఇక్కడ నియమితులయ్యారు. 2016లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరి 2021లో ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో పరిపాలనా విధులు నిర్వహించారు. యుజి-2024 అడ్మిషన్స్ కన్వీనర్‌గానూ వ్యవహరించారు. ఆయనను ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించడంపై అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వడ్డీ రేట్లు తగ్గకపోవచ్చు..!

- ద్రవ్యోల్బణంపైనే ఆర్‌బిఐ దృష్టి
- ఎస్‌బిఐ ఛైర్మన్ శెట్టి అంచనా

ముంబయి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ప్రస్తుత ఏడాదిలో వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చని ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి పేర్కొన్నారు. ఇప్పటికే నెలకొన్న హెచ్చు ఆహార ద్రవ్యోల్బణ అనిశ్చితి నేపథ్యంలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను సడలించే అవకాశం లేదన్నారు. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ నాలుగు సంవత్సరాల్లో తొలిసారి రేట్ల కోతకు సంకేతాలు ఇచ్చిందన్నారు. ఇది ఇతర ఆర్థిక వ్యవస్థలలోని సెంట్రల్ బ్యాంకులను అనుసరించడానికి ప్రేరేపించవచ్చన్నారు. అయితే సెంట్రల్ బ్యాంక్‌లు దేశ పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటాయన్నారు. ఫెడ్ రేట్ల తగ్గింపు ప్రభావం చూపినప్పటికీ.. ఆర్‌బిఐ మాత్రం దేశీయంగా అహార ద్రవ్యోల్బణంపై దృష్టి పెట్టనుందన్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఏడాది వడ్డీ రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చన్నారు. 2025 జనవరి - మార్చి త్రైమాసికం వరకు వేచి చూడాల్సి రావొచ్చన్నారు. ఇంతలో అహార ద్రవ్యోల్బణం తగ్గుదల ఉంటే తప్పా రేట్లలో తగ్గింపును ఆశించలేమన్నారు. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) అక్టోబర్ 7-9 తేదీల్లో భేటీ కానుంది.

జులైలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.54 శాతం గా ఉండగా.. ఆగస్టులో 3.65 శాతానికి పెరిగింది. ఆర్‌బిఐ లక్ష్యం 4 శాతం కంటే తక్కువగా ఉన్నప్పటికీ.. అహార ద్రవ్యోల్బణం 5.66 శాతంగా చోటు చేసుకుంది. వడ్డీ రేట్ల తగ్గింపునకు తొందరపడబోమని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇటీవల అన్నారు. దీంతో అక్టోబర్‌లో జరగనున్న ఆర్‌బిఐ మానిటరీ పాలసీ సమావేశంలో కీలక వడ్డీరేట్లను తగ్గిస్తారన్న నిపుణుల అంచనాలకు శక్తికాంత తాజాగా చెక్ పెట్టినట్లయ్యింది. తాజాగా ఎస్‌బిఐ చీఫ్ కూడా అదే తరహాలో వ్యాఖ్యలు చేయడంతో రుణగ్రహీతల ఆశలపై మరింత నీళ్ల చల్లినట్లయ్యింది. వరుసగా రెండో నెలలోనూ ద్రవ్యోల్బణం నాలుగు శాతం కంటే తక్కువగా చోటు చేసుకుందని దాస్ గుర్తు చేశారు. అయినప్పటికీ కీలక వడ్డీరేట్ల తగ్గింపు అంశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు.

పాలసీ విధానకర్తలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. దేశంలో అధిక ధరలు నెలకొన్న నేపథ్యంలో హెచ్చు వడ్డీ రేట్లను కొనసాగించాలని ఆర్‌బిఐ ఇటీవల నిర్వహించిన ఎంపిసి భేటీలో నిర్ణయించింది. దీంతో వరుసగా తొమ్మిదో సారి కూడా వడ్డీ రేట్లను యథాతథంగా ప్రకటించింది.

ఇసుజు మోటార్స్ నుంచి కొత్త చాసిస్ వేరియంట్

న్యూఢిల్లీ : ఇసుజు మోటార్స్ ఇండియా తన కొత్త డి-మ్యాక్స్ వాణిజ్య వాహన శ్రేణిలో ఒక కొత్త క్యాబ్ ఛాసిస్ వేరియంట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. దీని ధరను చెన్నయ్ ఎక్స్‌షోరూం వద్ద రూ.9,99,999గా నిర్ణయించింది. దీని కోసం బుకింగ్స్‌ను తెరిచినట్లు పేర్కొంది. దీంతో తమ వాణిజ్య పికప్ వాహనాల శ్రేణిని విస్తరించినట్లయ్యిందని తెలిపింది.

తగ్గిన రిలయన్స్ ఇన్‌ఫ్రా రుణాలు

ఓ అనీల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాపై రుణాల భారం తగ్గింది. మొత్తం రుణాలను రూ.3,831 కోట్ల నుంచి రూ.475 కోట్లకు తగ్గించుకున్నట్లు వెల్లడించింది. బకాయిలు తగ్గించుకున్న తర్వాత రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీ నికర విలువ రూ.9,041 కోట్లుగా ఉందని ఆ సంస్థ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఎల్ఐసి, ఎడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఐసిఐసిఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌తో పాటు ఇతర రుణదాతల బకాయిలను చెల్లించినట్లు తెలిపింది.

PURE ELECTRIC VEHICLE

2025లో ఐపిఒకు ప్యూర్ ఇవి..

- నాలుగేళ్లలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

హైదరాబాద్ : విద్యుత్ ద్విచక్ర వాహన కంపెనీ ప్యూర్ ఇవి 2025లో ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే నాట్కో ఫార్మా ఫ్యామిలీ ఆఫీస్, లారస్ ల్యాబ్స్ ఫ్యామిలీ ఆఫీస్, హెచ్‌టి వెంచర్స్, బిసిసిఎల్, ఐఐటి హైదరాబాద్ తదితర ప్రముఖ పెట్టుబడిదారుల మద్దతుతో కంపెనీ బలమైన పెట్టుబడిదారుల నమ్మకాన్ని కలిగి ఉందని పేర్కొంది.

గత మూడేళ్లుగా నిర్వహణ లాభాలను సాధించిందని తెలిపింది. రాబోయే నాలుగేళ్లల్లో రూ.2000 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్యూర్ ఇవి సిఇఒ రోహిత్ వదేరా తెలిపారు.

అమెజాన్ ఇండియా హెడ్‌గా సమీర్ కుమార్ నియామకం

న్యూఢిల్లీ : ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా హెడ్‌గా సమీర్ కుమార్ నియమితులయ్యారు. అక్టోబర్ ఒక్కటో తేది నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆ కంపెనీ బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం ఈ హోదాలో ఉన్న మనీశ్ తివారీ ఆగస్టు 6న రాజీనామా చేశారు. ఆ స్థానంలో సమీర్‌కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు. సమీర్ కుమార్ 1999 నుంచి అమెజాన్‌లో పని చేస్తున్నారు.

ఎగిసి..పడిన మార్కెట్లు..

- సెన్సెక్స్‌కు 131 పాయింట్ల నష్టం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకొనేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశమైన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం ఓ దశలో రికార్డ్ గరిష్టాలను నమోదు చేశాయి. అమ్మకాల ఒత్తిడితో తుదకు నష్టాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ ఉదయం 83,037 పాయింట్ల వద్ద ప్రారంభమై.. ఇంట్రాడేలో ఏకంగా 83,326 సరికొత్త గరిష్ఠాన్ని తాకింది. చివరికి 131.43 పాయింట్ల నష్టంతో 82,948.23 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ 41 పాయింట్లు తగ్గి 25,378 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్-30లో టిసిఎస్, ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్, సన్‌ఫార్మా, టాటాస్టీల్, టాటా మోటార్స్, టైటాన్, ఏషియన్ పెయింట్స్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మరోవైపు బజాజ్‌ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, నెస్లే ఇండియా, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎస్‌బిఐ, ఎల్‌అండ్‌టి షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. ఆటో, ఫార్మా, మెటల్, ఆయిల్, గ్యాస్ రంగాలు 0.5 నుంచి ఒక్క శాతం వరకు తగ్గాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.7 శాతం, స్మాల్‌క్యాప్ 0.5 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

సంపాదకీయం

చాలదు

విపత్తులు కలిగించే నష్టాలు అపారం. వాటి బారిన పడ్డ బాధితులను ఎంతగా ఆదుకున్నా జరిగిన నష్టాలను పూరించడం అసాధ్యం. ప్రభుత్వాలు చేసే సాయం కొద్దిపాటి ఉపశమనం మాత్రమే. చితికిపోయిన బతుకులు లేచి నిలబడటానికి ఊతం ఇస్తుందంతే. కానీ ఆపన్నులకు ప్రభుత్వాలు చేస్తున్న సహాయం ఆ మాత్రం కూడా ఉండటకపోవడం వారి పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. రాష్ట్రంలో వచ్చిన ఇటీవలి వరదలు చాలా మట్టుకు ఏలికలు నివారించదగినవి. అనూహ్య వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రకటించిన పరిహారం ఎంత మాత్రం సరిపోదు. వారికి కనీస ఊరట కలిగించదు. ప్రభుత్వ అంచనాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 5.67 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. మూడు లక్షల మంది రైతులు బాధితులు. కౌలు రైతులకు కూడా పరిహారమన్నా వారి గుర్తింపు కీలకం. కాగా ఇంతా చేసి ప్రధాన పంటలైన వరి, పత్తి, వేరుశనగ, ఇత్యాది పంటలకు ఎకరాకు ఇస్తామంటున్నది రూ. పది వేలు. అపరాలకైతే 6 వేలు. మిర్చి సహా అన్ని రకాల ఉద్యానవన పంటలు, తోటలకు 14 వేలు, కూరగాయలకు 4 వేలు. కొబ్బరి, ఆయిల్‌పాం చెట్టుకు 1,500. ఈ పరిహారం రైతులు ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడిలో కొంచెం కూడా ఉండదు. పంట చేతికొస్తే రైతుకు లభించే ఆదాయంతో పోల్చితే పిసరంత.

ఎకరా వరి పంట సాగుకు రైతుకు తక్కువలో తక్కువ పాతిక వేలవుతుంది. కౌలు రైతుకైతే ఇంకో పది వేలు ఎక్కువ. ప్రభుత్వం ఇస్తానంటున్నది పది వేలు. పత్తి ఖర్చు యాభై వేల పైమాటే. మిరప ఖర్చు లక్షలవుతోంది. ఇవే కాదు, అన్ని పంటలదీ ఇదే పరిస్థితి. అందుకే వరికి ఎకరాకు కనీసం పాతిక వేల సాయం కోరుతున్నారు. వాణిజ్య పంటలకు, హార్టికల్చర్, తోటలకు రైతులు పెట్టిన పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని సముచిత స్థాయిలో పరిహారం ఇవ్వాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. నేషనల్ శాంపిల్ సర్వే సహా ఏ సర్వేలను చూసినా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఖర్చులు బాగా ఎక్కువనే చెబుతున్నాయి. రైతుల్లో 93 శాతం మంది రుణగ్రస్తులని, సగటు అప్పు దేశంలోనే అత్యధికం 2.45 లక్షలని వెల్లడించాయి. మన రాష్ట్ర ప్రభుత్వం సైతం పంటలకు మద్దతు ధర నిర్ణయించే వ్యవసాయ ఉత్పత్తుల వ్యయ, ధరల సంస్థ (సిఎసిపి)కు ఏటా పంపే నివేదికల్లో వ్యవసాయ ఖర్చుల వివరాలూ ఇదే చెబుతున్నాయి. రైతుల, కౌలు రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు, అంతకంతకూ సాగు తగ్గుదల ఇవన్నీ వ్యవసాయ సంక్షోభానికి సంకేతాలు. ఈ పరిస్థితుల్లో ఊహించని స్థాయిలో వరదలొచ్చి పంటలను నష్టపరిస్తే రైతులు కోలుకోవడం కష్టం. వీటన్నింటిపై ఆలోచించైనా ప్రభుత్వం పరిహారం పెంచాల్సి ఉంటుంది.

వైపరీత్యాల వేళ వివిధ వర్గాలకు కేంద్ర ప్రభుత్వం అందించే సాయం క్షతగాత్రులను పరిహసిస్తుంది. ధరలకనుగుణంగా ప్రతి ఐదేళ్లకోమారు సహాయానికి సంబంధించి స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ పెంచాలి. 2015లో కేంద్రం స్కేలును సవరించగా అది 2022 మార్చి వరకు కొనసాగింది. బిజెపి సర్కారు 2020లో సవరించాల్సి ఉన్నా రెండేళ్లపాటు కాలయాపన చేసింది. విపత్తు బాధితులు సర్కారీ సాయాన్ని కోల్పోయారు. 2022లో స్కేలును పెంచి 2026 వరకు అమలు చేస్తామంది. రాష్ట్ర ప్రభుత్వం విషయానికొస్తే హుదూద్ తుపాన్ సమయాన 2014లో సహాయాన్ని నిర్ణయించింది. 2023 వరకు అదే కొనసాగింది. కేంద్రం 2022లో స్కేలును సవరించగా 2023 చివరిలో వైసిపి సర్కారు జిఓ ఇచ్చింది. ఆ నిబంధనల ప్రకారం ఎకరాకు గరిష్టంగా ప్రధాన పంటల రైతులకు దక్కేది 6,800. ఇప్పుడు కూటమి సర్కారు పది వేలిస్తామంటోంది. కేంద్ర ప్రభుత్వానిది అంతకంటే తక్కువ. ఇరిగేటెడ్, నాన్ ఇరిగేటెడ్, విస్తీర్ణం శ్లాబులు ఉండనే ఉన్నాయి. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ రూల్స్ ప్రకారమే కేంద్రం నుంచి నిధులొస్తాయి. ఎక్కువ ఇవ్వదలుచుకుంటే రాష్ట్ర ప్రభుత్వమే ఆ నిధులు భరించాలి. అసలు కేంద్రం ఎంతిస్తుందో అసలు ఇస్తుందో లేదో తెలీదు. సి.ఎం చంద్రబాబు, కేంద్రం ఇచ్చినా ఇవ్వకపోయినా తామిస్తామంటున్నారు. పరిహారంపై సి.ఎం. ప్రకటన తప్ప ఇంకా జిఓ రాలేదు. ఈ నెల 21న స్పష్టత వస్తుందన్నారు ముఖ్యమంత్రి. విపత్తు బాధితుల పట్ల ప్రభుత్వాలు చూపాల్సింది కాస్తంత మానవత్వం, భరోసా!

మహనీయుల మాట

ఏ విషయాన్నయినా నిగ్రహం కోల్పోకుండా వినగలిగే సామర్థ్యాన్ని విద్య ప్రసాదిస్తుంది.

- రాబర్ట్ ఫ్రాస్ట్,
అమెరికన్ కవి.

Robert Frost

వంద రోజుల అసహనం, అపనమ్మకం

విశ్లేషణ

తె.ర

లాంఛనంగా జరపాల్సిన ఈ వంద రోజుల వేడుకను పెద్ద ఉత్సవంలా ప్రచారం చేసుకోవడంలోనే బలహీనత స్పష్టమవుతుంది. ఒకసారి నెట్ పరికిస్తే అన్ని ఇంగ్లీషు పత్రికలలోనూ చాలా జరిగిపోయిందని రైటప్పులు రాయించుకోవడం, అందరూ అచ్చుగుద్దినట్టు ఒకే జాబితా రాయడం బట్టి వాటికి ఎలాంటి ఆదేశాలు వచ్చిందీ తెలిసిపోతుంది. మంగళవారం నాడు మోడీ 'సుభద్ర' పేరుతో ఒక పథకం ప్రారంభిస్తూ తాము ఎన్ని చేశామో ఏకరువు పెట్టారు. నిజానికి ఈ అపనమ్మకం ఎన్నికల ఫలితాలు రాకముందే మొదలైంది. రాబోయే వంద రోజులలో ఏం చేయాలనేది ముందే గత ప్రభుత్వమే చర్చకు పెట్టడం వంటి ప్రహసనం గతంలో ఎన్నడూ జరిగి వుండదేమో! కానీ మోడీ మోతకు అవన్నీ అవసరమైనాయి. ముందే నిర్ణయించాము గనక ఆ వంద రోజుల పనులు చేశామని ఆయన ఇప్పుడు చెప్పుకుంటున్నారు.

నరేంద్ర మోడీ సర్కారు మూడో దఫా పాలనకు వంద రోజులు నిండిన పేరుతో హడావుడి చేయాలని బిజెపి, సంఘపరివార్‌లు ఎంత హంగామా చేసినా వాస్తవాలు మాత్రం వెక్కిరించేలా గోచరిస్తున్నాయి. నిజానికి మూడోసారి వచ్చిన ప్రభుత్వానికి ఇవేవీ పెద్ద సందర్భాలు అవసరం లేదు. అయితే ఈ సారి కేంద్రంలో ఎన్‌డిఎ సర్కారు ఏర్పడిన తీరులోనే ఆ బండారం దాగుంది. నాలుగు వందల జపంతో మొదలై చివరకు అందులో సగం దగ్గర ఆగి అన్య పక్షాల మద్దతుపై ఆధారపడి రాజ్యం చేయవలసిన రాజకీయ దురవస్థ అడుగడుగునా అడ్డు చక్రం వేస్తున్నది. లాంఛనంగా జరపాల్సిన ఈ వంద రోజుల వేడుకను పెద్ద ఉత్సవంలా ప్రచారం చేసుకోవడంలోనే బలహీనత స్పష్టమవుతుంది. ఒకసారి నెట్ పరికిస్తే అన్ని ఇంగ్లీషు పత్రికలలోనూ చాలా జరిగిపోయిందని రైటప్పులు రాయించుకోవడం, అందరూ అచ్చు గుద్దినట్టు ఒకే జాబితా రాయడం బట్టి వాటికి ఎలాంటి ఆదేశాలు వచ్చిందీ తెలిసిపోతుంది. మంగళవారం నాడు మోడీ 'సుభద్ర' పేరుతో ఒక పథకం ప్రారంభిస్తూ తాము ఎన్ని చేశామో ఏకరువు పెట్టారు. నిజానికి ఈ అపనమ్మకం ఎన్నికల ఫలితాలు రాకముందే మొదలైంది. రాబోయే వంద రోజులలో ఏం చేయాలనేది ముందే గత ప్రభుత్వమే చర్చకు పెట్టడం వంటి ప్రహసనం గతంలో ఎన్నడూ జరిగి వుండదేమో! కానీ మోడీ మోతకు అవన్నీ అవసరమైనాయి. ముందే నిర్ణయించాము గనక ఆ వంద రోజుల పనులు చేశామని ఆయన ఇప్పుడు చెప్పుకుంటున్నారు. మరోవైపున హోంమంత్రి అమిత్‌షా కూడా అదే పనిలో వున్నారు. మూడు కోట్ల కొత్త ఇళ్ల నిర్మాణం, యువతకు సహాయ పడేందుకు రెండు లక్షల కోట్ల సహాయం, గ్రామాలకు రోడ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, కొత్త పెన్షన్ పథకం, 11 లక్షల మంది మహిళలను లక్షాధికారి దీదీలను చేయడం, రైతులకు సహాయం... ఇలా చాలా జాబితా చదివారు. నిజానికి ఇందులో చాలా భాగం గతంలో అమలు కానివీ, ఇప్పుడు కూడా స్పష్టత లేనివే. వచ్చిన మేరకు కూడా ఉద్యమాల ఒత్తిడికి జంకి మొక్కుబడిగా ప్రకటించినవి వున్నాయి. పదేళ్ల తర్వాత కూడా గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయలేకపోయామని ప్రధాని పరోక్షంగా ఒప్పుకుంటున్నారన్నమాట. ఇక నిరుద్యోగం ప్రపంచంలో ఎక్కడా లేనంత రికార్డు స్థాయిలో వుంటే వారి పేరిట కార్పొరేట్లకు నెల జీతం జమ చేయడం ఓ విపరీత విధానం. వీటినే మహత్తర విజయాలుగా మోడీ సర్కారు గానీ ఆయన పార్టీగానీ ప్రచారం చేసుకోవడం, ఎన్‌డిఎ భాగస్వాములుగా వున్న పార్టీలు వంత పాడటం హాస్యాస్పదం. ఇదేగాక విదేశాంగ విధానంలోనూ గొప్ప ఫలితాలు సాధించినట్టు మరో ప్రచారం.

ఉత్తుత్తి ఊసులు

నిజానికి ఈ గొప్పల వెనక నిజాలేమిటో ప్రతి రోజూ అనేక రూపాల్లో వెల్లడవుతూనే వచ్చింది. పెన్షన్ పథకమే తీసుకుంటే కేంద్రం ప్రకటించిన నూతన ఫార్ములా పాత సీసాలో పాత సారా తప్ప మరేమీ కాదని ఉద్యోగ సంఘాలన్నీ తోసిపుచ్చాయి. గిరిజన గ్రామాల అనుసంధానానికి అంత ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంలో ఉద్దేశం అక్కడ సహజ సంపదలను కొల్లగొట్టే కార్పొరేట్లకు సౌలభ్యం కలిగించడం, మావోయిస్టుల ఎన్‌కౌంటర్లకై సాయుధ దళాలను పంపించడం తప్ప మరొకటి కాదని మీడియాలో వ్యాఖ్యలు వచ్చాయి. గిరిజనుల ఉద్యమాలను అణచివేయడం సరేసరి. పైగా మహా సంపన్నులపై పన్నులతో ప్రభుత్వానికి ఆదాయం పెంచుకోలేని స్థితిలో ఖనిజాలను సహజ సంపదలను దోచుకోవడం మాత్రమే మార్గంగా కేంద్రం భావిస్తున్నది. ఆ హక్కు కార్పొరేట్లకు కల్పించి వారి వత్తాసు పొందాలనుకుంటున్నది. రైతాంగ ఆందోళనలను, న్యాయమైన కోర్కెలను దారుణ నిర్బంధానికి గురిచేసిన మోడీ సర్కారు ఇప్పుడేదో వారి కోసం విదిలించడమే విశేషంగా చెప్పుకోవడం ఇంకా వింత. సాగించిన ఆ నిర్బంధం చాలనట్టు బిజెపి ఎంపీ కంగనా రనౌత్ రైతాంగ ఆందోళనను అణచివేయకపోవడం వల్ల బంగ్లాదేశ్‌లో వంటి పరిస్థితి వచ్చి వుండేదని నోరు పారేసుకుని తర్వాత మౌన ముద్ర వహించాల్సి వచ్చింది. ఆ పార్టీయే తాళం వేయక తప్పలేదంటే ఎంత ఘోరంగా మాట్లాడారో తెలుస్తుంది. అయితే అవి ఆమె మాటలే కాదు, ఆ పార్టీ వాస్తవ ఆలోచనలు కూడా. స్టాక్ మార్కెట్ రెండు మూడు సార్లు ఒడుదుడుకులకు గురై రూ. రెండు మూడు లక్షల కోట్లు నష్టపోగా ఈ వంద రోజుల సమీక్షలలో మాత్రం అదేదో ఉరుకులు పరుగుల మీద సాగినట్టు పచ్చి అవాస్తవాలు రాయించుకుంటున్నారు.

ఇంటా బయటా రివర్సే

పైన పటారం లోన లొటారంలా ఇవన్నీ చేస్తున్నా అసలు సంగతి అయ్యవార్లకు తెలుసన్నట్టు తయారైంది బిజెపి, ఆరెస్సెస్ అగ్రనేతల వ్యవహారం. ఫలితాలు వచ్చిన కొద్ది రోజుల్లోనే మోడీపై ఆరెస్సెస్ బాసులకు నమ్మకం తగ్గిందనే కథలు వెలువడ్డాయి. వాటిపై నామకార్థంగా ఖండనలు వదిలినా అవి కూడా మరింతగా అనుమానాలు పెంచే తరహాలో సాగాయి. ఎవరూ దేవుడు కాదనీ, ఎప్పుడూ ఒకరినే తాము నెత్తిన పెట్టుకోమని కూడా వారు అన్యాపదేశంగా మోడీకి సంకేతాలు పంపారు. మోడీ హవాకు ఎదురు లేదనుకున్నప్పుడు పూర్తిగా ఆకాశానికెత్తిన ఆరెస్సెస్ సంచాలకులు ఆధికృత రాకపోయేసరికి అమాంతం ప్లేటు మార్చడం ఆశ్చర్యమేమీ కాదు. వారికి ప్రాథమికంగా అధికారం చలాయించడం, తమ మతతత్వ ఎజెండా చలామణి చేయడం ముఖ్యం. అంటరానితనం, అసమానతలు పోవాలని సూక్తులు చెబుతూనే హిందూ మతం మాత్రమే అన్నిటికన్నా ఉదారమైందని మోహన్ భగవత్ మాట్లాడ్డం ఎవరూ నమ్మే విషయం కాదు. ఎందుకంటే భయంకరమైన కుల వివక్ష లేకుండా ఆ మతం లేదనీ, దాంతో రాజకీయం నడిపే పరివార్ వుండదనీ అందరికీ తెలుసు. కానీ ఏదో విధంగా తమ అసంతృప్తినీ కొరతనూ బయటపెట్టడానికి అదే సమయంలో తమ మధ్య ఏదో తేడా వుందనే భ్రమ కలిగించడానికి ఇవన్నీ చేశారు. చేస్తారు కూడా. కాని ఇవన్నీ తమ మత రాజకీయాల కొనసాగింపుకే. నాగపూర్‌కు అంటే వారి కేంద్ర స్థానానికి ఇష్టుడైన మాజీ బిజెపి అధ్యక్షుడు, మూడో దఫా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఒకడుగు ముందుకేసి తనకు ప్రధాని పదవి ఆఫర్ వచ్చినట్టు బహిరంగంగా ప్రకటించారు. ఆయన చెప్పిన లేదా మీడియా వ్యాఖ్యానించిన ప్రకారం ప్రతిపక్షాలు ఆ ఆఫర్ ఇచ్చాయట. నాకు పరివార్ అన్నీ చేసింది గనక మోడీ నాయకత్వాన్ని ఎందుకు వదలిపెడతాను అని ఆయన అన్నప్పటికీ నిజానికి ఈ విషయం బయట పెట్టడంలోనే అసలు వ్యూహం వుంది. ప్రధాని పీఠానికి కూడా ప్రత్యామ్నాయ నాయకులున్నారని చెప్పడం వుంది. విదేశాలలో ఏదో ఘనత వున్నట్టు చూపించాలనులకుంటే రష్యా, ఉక్రెయిన్ పర్యటనల ఉబలాటం బెడిసి కొట్టింది. దాన్ని చక్కదిద్దడానికి మంత్రి జయశంకర్ చాలక స్వయంగా మోడీనే మళ్లీ రంగంలోకి దిగక తప్పలేదు.

ఇదేగాక మూడోసారి గెలుపు తర్వాత బిజెపి నేతలు ఇష్టానుసారం మాట్లాడటం, కంగనా రనౌత్, బ్రిజ్ భూషణ్ దర్శన్ సింగ్‌తో సహా పలువురు ఆంక్షలకు గురి కావడంలో అసహనం దాగేది కాదు. కనీసం వారికి అక్షింతలు వేసినట్టు చేసిన తర్వాత కూడా ఈ ధోరణి మారడం లేదు. తాజాగా రాహుల్ గాంధీని దేశంలోనే మొదటి టెర్రరిస్టు అని కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ దూషించారు. ఇలాగే మాట్లాడితే మీ నానమ్మ గతే మీకు పడుతుందని మరో నేత హెచ్చరించారు. సీనియర్ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా రాహుల్‌పై తిట్లు కురిపించి కృతజ్ఞత చాటుకున్నారు. నిజానికి ప్రతిపక్ష కూటమిపైన రోజూ నిందారోపణలు చేయడం ఈ దఫా బిజెపికి నిత్యకృత్యమైపోయింది. ఇది ఎంతగా ముదిరిందంటే సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తర్వాత మోడీతో సహా ఆ పార్టీ నేతలు నివాళు లర్పించారు గాని పరివార్ అనుయాయులు చాలామంది దారుణమైన దుర్భాషలకు పాల్పడ్డారు. రాష్ట్రాలలో ప్రత్యక్ష దాడులు, గోగూండాల హత్యాకాండ, కేరళలో ఎల్‌డిఎఫ్ సర్కారుపైన నిత్య దాడి నీచమైన స్థాయిలో నడిపిస్తున్నారు. తెలంగాణలోనైతే కేంద్రమంత్రి బండి సంజయ్ కొత్త సచివాలయం గోపురాలు ముస్లిం కట్టడాలను తలపిస్తున్నాయన్నట్లు తాము వస్తే వాటిని వెంటనే కూల్చేస్తామని బెదిరిస్తున్నారు. ఈ అసహనాన్ని ఆ పార్టీ పెద్దలే భరించలేని దశ, అలాగే యు.పి లో యోగి బుల్డోజర్ పాలనను కూడా సుప్రీం కోర్టు ఒకటికి రెండు సార్లు తప్పు పట్టవలసి వచ్చింది!

రాజ్యాంగ విలువలకూ ఎసరు

రాజకీయ సవాళ్లతో రాజ్యాంగ నిబంధనలు, మర్యాదలు కూడా తోసిపుచ్చి బోనులో చిక్కిపోతున్నారంటే అదీ వారిని ఆవరించిన భయానికి మరో నిదర్శనం. రాజ్యాంగ పరంగా రెండో స్థానంలో వున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ మంత్రులను మించి ప్రతిపక్షాలపై విషం కక్కుతున్నారు. తాజాగా ఆయన సుప్రీం కోర్టు వ్యాఖ్యలను కూడా తప్పు పట్టేలా మాట్లాడటం ఆశ్చర్యం కలిగించింది. స్వతంత్రత, గౌరవం నిలుపుకోవాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి హితవు చెప్పడం ఆయనకు దాన్ని అవమానించడంగా కనిపించింది. ఇదే కోవలో ఎన్నికల సంఘాన్ని కూడా ఏమీ అనకూడదని సలహా ఇచ్చేశారు! మోడీ అయితే గణేశ్ పూజ పేరిట ఎకాఎకిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ చంద్రచూడ్ నివాసానికే వెళ్లి కలకలం సృష్టించారు. ఇది పాలనా సంప్రదాయ విరుద్ధమైన చర్య అనేది అసలు విషయం కాగా వినాయక పందిరికి వెళ్లినా ప్రతిపక్షాల నేతలు తప్పు పడుతున్నారని దాన్ని మతపరమైన మలుపు తిప్పే ప్రయత్నం చేశారు. నవంబరులో పదవీ విరమణ చేయనున్న సిజెఐ చంద్రచూడ్ ముందు అనేక కీలక కేసులున్నాయి. ప్రధాని కలిసిన తర్వాత ఈ మూడు రోజులలోనూ సుప్రీం కోర్టు కొలీజియం రాష్ట్రాల హైకోర్టు సిజెలుగా గతంలో ఇచ్చిన కొన్ని పేర్లను వెనక్కు తీసుకోవడం గమనించదగ్గది. ఏక కాలంలో ఉపరాష్ట్రపతి, ప్రధాని ఉభయులూ న్యాయవ్యవస్థకు సంబంధించి విమర్శలకు గురికావడం దేనికి సూచన?

మరోసారి జమిలి ఎన్నికల ముచ్చట తీసుకురావడం దీనికి పరాకాష్ట. ఏది ఏమైనా జమిలి బిల్లు ఆమోదించి తీరతామని మోడీ ముందు, అమిత్ షా తర్వాత ప్రకటించేశారు. కేంద్ర క్యాబినెట్‌లోనూ మమ అనిపించారు. సమాఖ్య రాజ్యాంగాన్ని అనుసరించే భారత దేశంలో ఇది వాంఛనీయం కాద. సాధ్యమూ కాదు. అందులోనూ ఇతరులపై ఆధారపడిన బిజెపి ఆ పని ఎలా చేయగలుగుతుంది? అనేక రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయి. అయితే మెజార్టీ రాని ఈ సర్కారును పూర్తికాలం నడిపే బదులు ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన వుందని పరిశీలకుల కథనం. వయసు పైబడి ఎలాగో నెట్టుకొస్తున్న బీహార్ సిఎం నితీశ్ కుమార్‌కు కూడా త్వరలోనే ఎన్నికలు వస్తాయి గనక జమిలి ఓకె అంటున్నారు. టిడిపి వంటి పార్టీలు ఇదమిద్దంగా చెప్పవలసి వుంది. ఏమైనా రాజ్యాంగ సూత్రాల ప్రకారం ఇది కష్టసాధ్యమే. ఒకవేళ బిల్లు ఆమోదించినా రాజ్యాంగ మౌలిక స్వభావ విరుద్ధమని సుప్రీంకోర్టులో సవాలు చేయొచ్చు. అయినా ఇంత ఏకపక్షంగా ప్రకటిస్తున్నారంటే రాజకీయ అనిశ్చితిని తీసుకురావాలనే వ్యూహంతోనే. వంద రోజుల సందడి మాటున దాగిన వంచనేంటో దీన్ని బట్టే మనకు తెలుస్తుంది. అయితే ఈ మేకపోతు గాంభీర్యం ఎంతో కాలం నిలవడం కష్టం.

★

ఎంపాక్స్ - వ్యాక్సిన్ అసమానతలు

ఎస్.కృష్ణస్వామి

ఎంపాక్స్ తాకిడితో వణికిపోతున్న ఆఫ్రికా ఖండంలోని దేశాలన్నింటికీ సుమారు కోటి డోసుల వ్యాక్సిన్‌ను తక్షణమే అందించాలని ఆఫ్రికా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అంచనా వేసింది. కానీ ధనిక దేశాలు, పేటెంట్లు కలిగి ఉన్న దేశాలు తమ ప్రజల వ్యాక్సిన్ అవసరాలు తీర్చే నెపంతో, వ్యాధి విస్తృతి అంతగా లేకపోయినా అవసరానికి మించి వ్యాక్సిన్ గుట్టలను తమ దగ్గర పోగేసుకొనే ప్రమాదం వుంది. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థలు వ్యాక్సిన్లను ఎంపాక్స్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న పేద దేశాలకు తక్షణమే అందించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యాధి సోకిన వారికి వైద్యం అందించేలా చూడాలని, తద్వారా వ్యాక్సిన్, వైద్యపరమైన అసమానతలను నివారించాలని, ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యతను గుర్తెరగాలని అభ్యుదయ కాముకులు, అంతర్జాతీయ సమాజం కోరుతున్నాయి.

ఆఫ్రికా ఖండంలోని డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, దాని ఇరుగు పొరుగు దేశాలైన బురుండి, కెన్యా, రువాండా, ఉగాండా తదితర దేశాలలో మంకీ పాక్స్ వ్యాధి విజృంభించడంతో... ఆగస్టు 14న అంతర్జాతీయంగా అన్ని దేశాలకు ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ) జారీ చేసింది. దీనినే డబ్ల్యు.హెచ్.ఓ ఎంపాక్స్‌గా పిలుస్తోంది. వైరస్ ద్వారా వ్యాపించే ఎంపాక్స్ వ్యాధి మధ్య ఆఫ్రికా, పశ్చిమ ఆఫ్రికా దేశాలను కొన్ని దశాబ్దాలుగా వణికిస్తూనే వుంది. దీన్ని ఆఫ్రికా దేశాలే కాక ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా, సమన్వయంతో ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియచేసింది. భారత దేశంలో కూడా 2022 జులైలో 30 కేసులు కనిపించడంతో పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని విధించారు. అయితే 2023 ఏప్రిల్ కల్లా తగ్గుముఖం పట్టడంతో మే లో అత్యవసర పరిస్థితిని ఉపసంహరించారు. 2022లో ఈ వ్యాధి 116 దేశాలకు విస్తరించి 99,176 కేసులు నమోదు కాగా 208 మంది మరణించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు అమెరికాలో వెయ్యికి పైగా కేసులు నమోదవగా...మన దేశంలో మూడు కేసులు మాత్రమే నమోదైనట్లు తెలుస్తోంది.

ఎంపాక్స్ అంటే...

ఈ వ్యాధి కోతుల ద్వారా వ్యాప్తి చెందుతుందని భావించడం వలన దీనిని మొదట మంకీ పాక్స్ అని పిలిచారు. అయితే వ్యాధి వ్యాప్తికి కోతులు వాహకాలుగా పని చేయడం లేదని, ఇది ఆఫ్రికన్ ఎలుకలు, ఉడతల వంటి జంతువుల ద్వారా సోకుతుందని గుర్తించిన కారణంగా డబ్ల్యు.హెచ్.ఓ దీనిని ఎంపాక్స్‌గా పేరు మార్చింది. స్వలింగ సంపర్కుల్లో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తోందని గుర్తించారు. రెండు నుండి నాలుగు వారాల పాటు తీవ్రమైన జ్వరం, వంటి నిండా దద్దుర్లు, లింఫ్ గ్రంథులు వాచి విపరీతమైన బాధ వంటి లక్షణాలు రోగుల్లో నమోదయ్యాయి. రోగం ముదిరితే దీంతోపాటుగా చాలా రకాల చర్మ సంబంధిత వ్యాధులు, మెదడువాపు వ్యాధి, కళ్ళల్లో పుళ్ళు ఏర్పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ సోకడం వంటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయి. వ్యాధి సోకిన వారిలో 3-6 శాతం మంది మరణాల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియచేసింది. ఇరవయ్యవ శతాబ్దంలో 30 కోట్ల మంది మరణానికి కారణమైన మసూచి వైరస్‌కి, ఎంపాక్స్ వైరస్‌కి దగ్గర సంబంధం, పోలిక ఉన్నాయి. కానీ, ఇది డి.ఎన్.ఎ రకానికి చెందినది కావడం వలన...ఆర్.ఎన్.ఎ వైరస్ రకానికి చెందిన కోవిడ్19 మహమ్మారిలా విజృంభించే అవకాశం తక్కువ. అయినప్పటికీ ఒక మనిషి నుండి మరొక మనిషికి సంక్రమించే రేటు తక్కువగా ఏమీ లేదు. ఒకరి నుండి 2.4 మందికి వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

వ్యాక్సిన్లు (టీకాలు)...

మసూచికి వాడే టీకా 85 శాతం సామర్థ్యంతో కొన్ని ఎంపాక్స్ వైరస్ రకాలకు కూడా పని చేస్తుందని తేలింది. అలాగే మసూచికి వాడే టికోవిరిమాట్ అనే మరో రకం టీకా ఎంపాక్స్ చికిత్సలో ఉపయోగపడుతుందని 'యూరోపియన్ మెడిసిన్స్ ఏజన్సీ' తెలిపింది. వ్యాధి విజృంభించిన పరిస్థితుల్లో పైన ఉదహరించిన వ్యాక్సిన్లు పరిమితమైన ఫలితాలనే ఇస్తున్నాయని అనుభవాలు చెబుతున్నాయి. ఎం.వి.ఎ-బి.ఎన్, ఎల్.సి 16, ఎ.సి.ఎ.ఎమ్ 2000, రష్యా వారి ఆర్థో ఫాక్స్ వాక్ వంటి పలు రకాల వ్యాక్సిన్లు ఎంపాక్స్‌ను నివారించగలవని డబ్ల్యు.హెచ్.ఓ సిఫారసు చేస్తోంది. ఈ టీకాలను 18 సంవత్సరాలకు పైబడిన వారు 28 రోజుల వ్యవధిలో రెండు మోతాదులు తీసుకోవాలి. 2024 జూన్‌లో వెలువడిన ఒక అధ్యయనం ప్రకారం ఎం.వి.ఎ-బి.ఎన్ మొదటి డోస్ 76 శాతం సామర్థ్యం చూపగా రెండో డోస్‌తో అది 81 శాతానికి పెరిగింది. అంతేకాక రోగ నిరోధక శక్తిని కూడా గణనీయంగా పెంచుతోందని తెలుస్తోంది. అలాగే ఎల్.సి 16, ఆర్థోఫాక్స్ వాక్ వ్యాక్సిన్లను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు.

వ్యాక్సిన్ అసమానతలు...

2022లో ఎంపాక్స్ సోకిన సమయంలో, కోవిడ్ లేదా ఇతర మహమ్మారుల సమయంలో ధనిక దేశాలు పేటెంట్ల పేరుతో వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి గుట్టలు గుట్టలుగా తయారు చేసికొని తమ అవసరాలకు మించి నిల్వ పెట్టుకొని పేద, ఇతర దేశాలకు సరైన సమయంలో అవసరానికి తగ్గట్టుగా కేటాయించక, వారికి అన్యాయం చేశాయి. కోవిడ్ సమయంలో అంతర్జాతీయ సమాజం ఎన్ని విజ్ఞప్తులు చేసినా చలించని ధనిక దేశాలు ఎక్స్‌పైరీ డేట్ దగ్గర పడుతున్న వ్యాక్సిన్లను పేద దేశాలకు ఇవ్వచూపించారంటే వ్యాక్సిన్ అసమానతలు పేద దేశాల విషయంలో ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతోంది. ఇప్పుడు కూడా, ఎంపాక్స్ తీవ్రత ఎక్కువగా ఉన్న కాంగో దేశానికి మొదటి పది వేల డోసుల్ని పంపి ఆదుకోవాల్సి ఉండగా అట్లాకాక రాజకీయ కారణాలతో అమెరికా మొదటి పది వేల డోసుల వ్యాక్సిన్లను నైజీరియాకు పంపింది.

ఎంపాక్స్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న అనేక ఆఫ్రికన్ దేశాలు వ్యాక్సిన్ల కోసం ఐక్యరాజ్య సమితిని, డబ్ల్యు.హెచ్.ఓ నీ, ధనిక దేశాలను దేబిరించాల్సిన పరిస్థితి ఉంది.

అటువంటి పేద దేశాలు కూడా చాలా ఎక్కువ ధరకు (ఒక్కో రకం డోసుకు వంద డాలర్లకు పైగా చెల్లించి) కొనుక్కొని, వాటిని మైనస్ 20 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత దగ్గర నిల్వ చేసుకొనే కనీస వసతులు కూడా లేని దేశాలు తీవ్రమైన వ్యాక్సిన్ అసమానతలకు గురవుతున్నాయి. ఎంపాక్స్ తాకిడితో వణికిపోతున్న ఆఫ్రికా ఖండంలోని దేశాలన్నింటికీ సుమారు కోటి డోసుల వ్యాక్సిన్‌ను తక్షణమే అందించాలని ఆఫ్రికా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అంచనా వేసింది. కానీ ధనిక దేశాలు, పేటెంట్లు కలిగి ఉన్న దేశాలు తమ ప్రజల వ్యాక్సిన్ అవసరాలు తీర్చే నెపంతో, వ్యాధి విస్తృతి అంతగా లేకపోయినా అవసరానికి మించి వ్యాక్సిన్ గుట్టలను తమ దగ్గర పోగేసుకొనే ప్రమాదం వుంది. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థలు వ్యాక్సిన్లను ఎంపాక్స్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న పేద దేశాలకు తక్షణమే అందించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యాధి సోకిన వారికి వైద్యం అందించేలా చూడాలని, తద్వారా వ్యాక్సిన్, వైద్యపరమైన అసమానతలను నివారించాలని, ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యతను గుర్తెరగాలని అభ్యుదయ కాముకులు, అంతర్జాతీయ సమాజం కోరుతున్నాయి.

జనవాక్యం

చదువులున్నా కొలువులేవీ!

దేశ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించడంలో పాలకులు ఘోరంగా విఫలమౌతున్నారు. కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసి చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిందిపోయి ఉన్న పరిశ్రమలే సమస్యల వలయంలో చిక్కుకొని దేశ వ్యాప్తంగా మూతపడుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. ముఖ్యంగా గత రెండేళ్ల కరోనా మహమ్మారి విలయతాండవం చేయడంతో ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దయనీయ పరిస్థితుల్లో చాలా పరిశ్రమల యజమానులు చేతులెత్తేసి పరిశ్రమలను షట్‌డౌన్ చేసేశారు. దేశవ్యాప్తంగా మూతపడిన చిన్న, పెద్ద తరహా పరిశ్రమల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతా రాహిత్యంతో, నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నది. మరోవైపు ఎలక్షన్ల ముందు దేశ వ్యాప్తంగా ఆ యా పార్టీల నాయకులు మేము అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్యను నిర్మూలిస్తాం...మీ జీవితాలలో వెలుగులు నింపుతాం...అని వాగ్దానం చేసిన ఆ నోటి నుండే తీరా ప్రజల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల ఉసురు తీస్తున్న వైనం సిగ్గుచేటు. ఏ విధంగా చూసినా చదువుకున్న పేద, మధ్య తరగతి యువత తమ పొట్ట నింపుకోవడం, తమకున్న విద్యతో, డిగ్రీలతో తన కుటుంబ సభ్యులను పోషించుకోవడం కూడా గగనకుసుమంగా మారింది. ముందు వెనుక ఏమీ లేని చదువుకున్న నిరుపేద, మధ్య తరగతి యువత ఎటూ పాలుపోని స్థితిలో వ్యవసాయ కూలీలుగా, పరిశ్రమలలో కార్మికులుగా మారిపోతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలనోర్చి తమను చదివించిన తల్లిదండ్రులకు న్యాయం చేయలేక సతమతమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించేలా సత్వరమే చర్యలు తీసుకోవాలి.

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

బిసిలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు

● మంత్రి సవిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిసిలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చేస్తూ బుధవారం కేబినెట్లో తీర్మానం చేయడం పట్ల సిఎం చంద్రబాబుకు బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు. బిసిలకు టిడిపితోనే మేలు కలుగుతోందన్న విషయం మరోసారి రుజువైందన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఏర్పాటుతో బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలకు ప్రాధాన్యమిస్తున్నారు. స్టడీ సర్కిల్ ద్వారా సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ బిసి విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. ఆదరణ పథకం కింద వెనుకబడిన తరగతుల్లో ఉన్న చేతివృత్తిదారులకు పనిముట్లు అందజేశారన్నారు. బిసి విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించారన్నారు.

డెంగీ డేంజర్ బెల్స్



● జిల్లాలో పెరుగుతున్న కేసులు
● ఇప్పటి వరకు 160 కేసులు నమోదు
● అనధికారికంగా వేలల్లో జ్వర పీడితులు
● ఆందోళనలో జిల్లా ప్రజలు
● ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన ఉమ్మిడి కృప(20) డెంగీ జ్వరంతో ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందడంతో జిల్లాలో అలజడి రేగుతోంది. డెంగీ జ్వర పీడితుల్లో ఆందోళన ఎక్కువైంది. ఆగస్టు, సెప్టెంబరుతోపాటు అక్టోబరు నెలల్లో డెంగీ ప్రమాదం పొంచి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ జ్వరాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో ఏ జ్వరమొచ్చినా ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణ జ్వరమైనా ఆసుపత్రులు, రక్త పరీక్షా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు.

జిల్లాలో 160 కేసులు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అధికారికంగా 4,600 మందికి ఎలిసా టెస్టులు చేయగా 160 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఆగస్టు నెలలోనే 1800 పరీక్షలు చేయగా అత్యధికంగా 45 కేసులు వెలుగుచూశాయి. ఈనెల 1 నుంచి 17 వరకూ 1500 మందిని పరీక్షించగా మరో 28 మందికి డెంగీ చోకింది. అలాగే ఇప్పటి వరకు 1.39 లక్షలు టెస్టులు చేయగా 5 మలేరియా కేసులు వెలుగు చూశాయి. సెప్టెంబరులో 11 వేల పరీక్షలు చేశారు. ప్రధానంగా డెంగీ కేసులు ఎన్నడూ లేనివిధంగా అధికంగా నమోదవుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కేసులు పెరుగుదలతో అటు జిల్లా ప్రజానీకంతోపాటు వైద్యాధికార వర్గాలు కలవరం చెందుతున్నాయి. ఇంకోవైపు ప్రయివేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న వారు వేలల్లోనే ఉంటారని సమాచారం. ప్రభుత్వాసుపత్రుల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది, సౌకర్యాలు కానరాక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. డెంగీతోపాటు మలేరియా, ఇతర వైరల్ ఫీవర్స్ వెంటాడుతున్న తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అరకొర చర్యలేనా..?

ప్రస్తుతం వర్షాకాలం సీజన్ నడుస్తోంది. ఎక్కడ చూసినా చెత్త, మురికి గుంటలు దర్శన మిస్తున్నాయి. దీంతో దోమలు దండయాత్రకు మరింత అవకాశం ఏర్పడుతుంది. వాటి వృద్ధి నానాటికీ పెరుగుతూ వస్తోంది. అధికారులు గుర్తించిన హై రిస్క్ గ్రామాల్లోనే డెంగీ మరింత వ్యాప్తి చెందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాంతాల్లో సరైన చర్యలు తీసుకోకుండా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే ఇందుకు కారణంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టులో యు.కొత్తపల్లి, నాగులాపల్లి, పెద్దాపురం మండలం పులిమేరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వీటిని హై రిస్క్ ప్రాంతాలుగా గుర్తించారు. గతంలో పి.మల్లవరం పిహెచ్‌సి పరిధిలోని జి.కొత్తపల్లి, కాకినాడ అర్బన్లో జగన్నాయక్‌పురం, దుమ్ములపేట, వేట్లపాలెం పిహెచ్‌సి పరిధిలో వేమవరం, గొల్లప్రోలులో పాపయ్య చావిడి వీధి, తాళ్లరేవు మండలంలోని పరదేశమ్మ పేట, కాకినాడ రూరల్ మండలం తమ్మవరం, యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్, ఎన్.సురవరం పిహెచ్‌సి పరిధిలోని కొలిమేరు, తుని పట్టణంలోని ఆర్‌కె.కాలనీ, జగ్గంపేట మండలం రాజపూడి, శంఖవరం మండలంలోని ఎ.మల్లవరం, శాంతి ఆశ్రమం, కోటనందూరు మండలం సంగవాకలను గుర్తించారు. వీటిల్లో జూన్ మొదటి వారం నుంచి ఇంటింటికి బృందాలను పంపించి గ్రామంలోని ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించారు. డ్రై డే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తూ, గుర్తించిన ప్రదేశాల్లో గంబూజ ఫిష్ పిల్లలను వదులుతున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 1.50 లక్షల చేప పిల్లల్ని విడుదల చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అయితే పారిశుధ్య మెరుగుదలకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నిర్ధారణ పరీక్షల్లో జాప్యం...

డెంగీ నిర్ధారణ పరీక్షలు, ఫలితాల్లో జాప్యం జరుగుతుండటంతో ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో కాకినాడ జిజిహెచ్, తుని ఏరియా ఆస్పత్రుల్లో మాత్రమే డెంగీ నిర్ధారణకు ఎలీసా పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో సేకరించిన శాంపిల్స్ ఈ ప్రాంతాలకు పంపుతున్నారు. కాకినాడ జిజిహెచ్‌లో రోజుకి సుమారు 100, తునిలో 25 పరీక్షలు చేస్తున్నారు. దాంతో జాప్యం అనివార్యమవుతుంది.

ప్రయివేటు ఆస్పత్రులు కిటకిట

డెంగీ కేసులు ఎక్కువగానే ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు అధిక సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. అయితే ప్రయివేటు ఆసుపత్రుల్లో చేసే పరీక్షలను తాము లెక్కల్లోకి తీసుకోవడం లేదని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు వివరిస్తున్నారు. జిల్లాలో పలు ప్రయివేటు ల్యాబుల్లో డెంగీ పరీక్షలు చేస్తున్నారు. కొన్ని చోట్ల రాపిడ్ టెస్టు కిట్లు ఉపయోగిస్తుండగా, మరికొన్ని చోట్ల ఎలీసా రీడరుతో చేస్తున్నారు. ప్రయివేటు ఆస్పత్రులు, ల్యాబుల్లో చేసే పరీక్షలను ప్రభుత్వ యంత్రాంగం పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో వాటిల్లో చేసే పరీక్షల్లో డెంగీ పాజిటివ్ వస్తే మరోసారి జిల్లా కేంద్రం కాకినాడ జిజిహెచ్‌లో ల్యాబ్‌కు పంపుతున్నారు. అక్కడ పాజిటివ్ వచ్చిన తర్వాతే డెంగీగా నిర్ధారిస్తున్నారు. ఆయా ప్రభుత్వ ల్యాబ్‌ల నుంచి డెంగీ పాజిటివ్ కేసుల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పంపుతుండగా వాటి ఆధారంగా జిల్లాలో నమోదవుతున్న డెంగీ కేసులను లెక్కకడుతున్నారు.

వాస్తవాలు చెబితే కోపమెందుకు?

● మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అమరావతి మునిగిపోయిన అంశంపై వాస్తవాలు మాట్లాడితే సిఎం చంద్రబాబుకు ఎందుకు కోపం వస్తుందో ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు అసమర్థ పాలన వల్ల విజయవాడ ప్రజలు ముంపునకు గురయ్యారని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు 100 రోజుల పాలన పూర్తిగా వైఫల్యాలతో కూడుకుందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

అరకొర సాయం : మల్లాది విష్ణు

ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా హెచ్చరించకపోవడం వల్లే వరదలతో విజయవాడ తీవ్రంగా నష్టపోయిందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. అరకొర సాయం ప్రకటించడం సరైందికాదని, బాధితులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో వైసిపి నాయకులు దేవినేని అవినాష్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంలోని పెద్దల తప్పిదాన్ని అధికారులపై వేస్తున్నారని విమర్శించారు. ప్రజలు రూ.7 వేల కోట్లు వరదల్లో నష్టపోతే సిఎం చంద్రబాబు కేవలం రూ.700 కోట్లు ఇస్తామనడం తగదన్నారు. నష్ట పరిహారాన్ని మరింత పెంచడంతోపాటు ఆస్తి పన్నును, విద్యుత్ బిల్లును పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యాపారులకు రూ.2 లక్షలు వడ్డీలేని రుణాలు ఇప్పించాలన్నారు.

దివాన్ చెరువు ఫారెస్ట్‌లో చిరుత సంచారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం శివారు దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్ట్‌లోనే చిరుత సంచరిస్తోందని, ట్రాప్ కెమెరాల్లో చిరుత సంచారాన్ని గుర్తించామని జిల్లా అటవీ అధికారి భారతి తెలిపారు. చిరుత జాడను కనుగొనేందుకు 73 ట్రాప్ కెమెరాలు, ఎనిమిది బోన్లు ఏర్పాటు చేశామని, 50 మంది సిబ్బందితో తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న రహదారిలో దివాన్‌చెరువు సమీపంలో 532 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని పేర్కొన్నారు. రెండు రోజులకొకసారి పందులపై దాడి చేస్తున్నట్టు గుర్తించామని, త్వరలోనే చిరుతను పట్టుకుంటామని తెలిపారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-I, AT BENGALURU
BSNL Building, 4th Floor, "TELEPHONE HOUSE", Rajbhavan Road, Bangalore-560001.

O.A. No. 514/2023

BETWEEN: **Bank of Baroda**, Kalyan Nagar Branch, Bangalore-560 043. **...Applicant**

Vs

AND: **Mr. Pradeep Kasilinka and another** **...Defendants**

SUMMONS ISSUED UNDER RULE-23(viii) OF THE DEBTS RECOVERY TRIBUNAL PROCEDURE RULES-1993

Defendants No. 1 and 2:-

1. Mr. Pradeep Kasilinka, S/o Mr. Rama Krishna, Residing at Flat No. 101, "Adhithya Enclave", Balaji Nagar 5th Lane, Amaravathi Road, Guntur-522 007, Andra Pradesh State. Pan: BSMPK6448R

2. Mrs. Pavana Deepthi Kavuri, W/o Mr. Pradeep Kasilinka, aged about 30 years, Residing at Flat No. 101, "Adhithya Enclave", Balaji Nagar 5th Lane, Amaravathi Road, Guntur-522 007, Andra Pradesh State. Pan: DFCPK0549Q

SUMMONS TO DEFENDANTS No. 1 and 2 BY WAY OF PAPER PUBLICATION

Whereas the applicant has instituted an Application Under Section 19 of the Recovery of Debts and Bankruptcy Act 1993 against the defendants / you for the recovery of a sum of Rs. 57,71,800/- (Rupees Fifty seven lakhs seventy one thousand & eight hundred only) together with current and future interest and other reliefs.

The above mentioned defendants are therefore hereby directed to appear before this Tribunal in person or through an Advocate or duly authorized agent, in support of their defence to show cause within 30 days from the date of Publication or **on 24.01.2025 at 10.30 A M** as to why the reliefs prayed for should not be grunted.

Take notice that in case of default the application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on the 17th day of September 2024.

By order of the Tribunal, Registrar,
Debts Recovery Tribunal-I, Bangalore - 560001.
Raghavendra Rao Manvi, Advocate
No. 94, 7th Cross, 4th Block, Doddabommasandra, Vidyaranyapura Post, Bangalore - 560 097.

లుకౌట్ సర్క్యులర్ జారీపై పూర్తి వివరాలు సమర్పించండి

● చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కేసులో పోలీసులకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి నాయకుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విషయంలో పోలీసులు జారీ చేసిన లుకౌట్ సర్క్యులర్ జారీపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసులో పోలీసులు తనపై జారీ చేసిన లుకౌట్ సర్క్యులర్‌ను ఉపసంహరించుకునేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని చెవిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల సమయంలో ఎస్‌వియు పోలీసులు నమోదు చేసిన కేసులో తనపై ఎల్‌ఓసి జారీ అయిందని, ఆ కేసులో ఇదే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని, కావున లుకౌట్ నోటీసు రద్దు చేసేలా ఉత్తర్వులివ్వాలని పిటిషనరు తరపున న్యాయవాది కోరారు. పిటిషనరు సోదరుడు లండన్‌లో విద్యాభ్యాసం చేయాల్సి ఉందని, అందువల్ల అక్కడకు వెళ్లడం తప్పనిసరని అన్నారు. ఎల్‌బిసి కారణంగా విదేశాలకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. వాదనల తర్వాత న్యాయమూర్తి, పోలీసులు సమర్పించే వివరాలను పరిశీలించకుండా ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేనని తేల్చి చెప్పారు.

ఒరిజినల్ రూపంలోనే భద్రపరచాలి

సినీనటి కాదంబరి జత్వానీ నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ఐప్యాడ్, ల్యాప్ ట్యాప్లను, వాటిలోని డేటాను ఒరిజినల్ రూపంలోనే భద్రపరచాలని పోలీసులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలోని డేటా అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. జత్వానీ నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ప్రస్తుతానికి ఆమెకు తిరిగిచ్చే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పిన విషయాలను హైకోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. విచారణను అక్టోబరు ఒకటో తేదీకి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ బి వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జత్వానీ ఎలక్ట్రానిక్ ఉపకరణాలను భద్రపరచాలంటూ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుదారు కె విద్యాసాగర్ పిటిషన్‌పై విచారణ వాయిదా వేశారు.

అవి సిఆర్‌జెడ్-2 పరిధిలోకి...

విశాఖపట్నం, భీమునిపట్నం బీచ్ సమీపంలో ఉన్న తమ నిర్మాణాలు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్)-2 పరిధిలోకి వస్తాయని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహారెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఆ నిర్మాణాల్లో కొన్నింటికి అనుమతులున్నాయని చెప్పారు. సిఆర్‌జెడ్-1 పరిధిలో ఉన్నట్లు చూపి పిటిషనరు కోర్టును తప్పుదోవ పట్టించారని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి చెప్పారు.

తమ నిర్మాణాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిల్ దాఖలు చేసిన పిటిషనర్, అందులో తమను ప్రతివాదిగా చేర్చలేదన్నారు. దీనిపై స్పందించిన డివిజన్ బెంచి మీరు పొందిన అనుమతులు కూల్చివేత నోటీసులు ఇతర అంశాలను సింగిల్ జడ్జి వద్దనే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. నిర్మాణాల కూల్చివేతలను నిషేధిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు లేనందున చర్యలు కొనసాగించండని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) అధికారులను ఆదేశించింది. తీసుకున్న చర్యలపై స్థాయీ నివేదికను తమ ముందుంచాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ వేసిన పిల్ తర్వాత నేహా రెడ్డికి సంబంధించిన ప్రహరీని కూల్చివేయడంపై హైకోర్టులో ఆమె అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి విచారణ ఈ నెల 25కు వాయిదా పడింది.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking

గుంటుపల్లి బ్రాంచ్ (13753)
6/4, NH 9, విజయవాడ రూరల్, గుంటుపల్లి - 521241, ఆంధ్రప్రదేశ్

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: శ్రీ రత్నలాల్ దేశాయి కంచర్ల, తండ్రి: వెంకయ్య & శ్రీమతి మంచాల సుధీక్షణ, భర్త: రత్నలాల్ దేశాయి** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ.26,21,967 (అక్షరాల ఇరవై ఆరు లక్షల ఇరవై ఒక వేల తొమ్మిది వందల అరవై ఏడు రూపాయలు)** ఖాతా నెం. 37537700000031 నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **05.07.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని **18.09.2024 వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి చెల్లించవలిసిన బకాయి **రూ.26,22,160 (అక్షరాల ఇరవై ఆరు లక్షల ఇరవై రెండు వేల నూట అరవై రూపాయలు)** తేది 31.08.2024 నాటికి + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

ఆర్.ఎస్. నెం. 179/1 మరియు 179/2 నందు మొత్తం స్థలం 1179.05 చ॥గ॥ లేదా 985.84 చ॥మీ॥లలో **అవిభాజ్యపు వాటా 60 చ॥గ॥ లేదా 50.17 చ॥మీ॥.** హద్దులు: తూర్పు: బజారు, దక్షిణం: బజారు, పడమర: జాస్తి వెంకటేశ్వరరావు మొ॥ ఆస్తి, ఉత్తరం: చింతా మోహన్ మొ॥ ఆస్తి.
పైన తెలిపిన స్థలం మొత్తంలోని "లక్ష్మీ నరసింహ రెసిడెన్సీ", గ్రౌండ్‌ఫ్లోర్‌లో ప్లింత్ ఏరియా 852.187 చ॥అ॥ గల ఫ్లాట్ నెం.104 (నిర్మాణం పూర్తయినది) అన్ని సౌకర్యాలతో. **హద్దులు:** తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా మరియు మెట్లు, ఉత్తరం: శూన్యాకాశం.

తేది: 18.09.2024, ప్రదేశం: గుంటుపల్లి **సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్**

విచక్షణారహితంగా హోర్డింగులు, ఫ్లెక్సీలు

● హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

హోర్డింగ్లు, ఫ్లెక్సీలపై నిత్యం రాజకీయ నేతల, సెలబ్రిటీల చిత్రాలను చూడాల్సిన అవసరం ప్రజలకు ఏమీ లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. విచక్షణారహితంగా హోర్డింగ్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని వ్యాఖ్యానించింది. అనధికారికంగా వాటిని ఏర్పాటు చేయడం వల్ల మున్సిపాలిటీలు పెద్దయెత్తున ఆదాయాన్ని నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. అనధికార హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగింపునకు తీసుకునే చర్యలు ఎలా ఉండాలో తెలియజేయాలని కోర్టు సహాయకారి (అమికస్ క్యూరీ)గా వ్యవహరిస్తున్న న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పంచాయతీరాజ్, పురపాలక చట్టాల నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ మాజీ స్పీకరు అగరాల ఈశ్వర్ రెడ్డి 2018లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● శానిటేషన్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ (ఆయా) వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుధ్య డైరెక్టరును యూనియన్ ప్రధాన కార్యదర్శి డి రమాదేవి బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. సెప్టెంబరు 2న ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల వేతనాల కోసం రూ.64.38 కోట్లు, మరుగుదొడ్ల శుభ్రత కోసం మరో రూ.23.52 కోట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఆయాలకు వేతనాలు ఇవ్వలేదని వివరించారు. 300 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పున:పరిశీలించాలని కోరారు. ఈ నిర్ణయం వల్ల ఆయాలపై విపరీతమైన పనిభారం ఉంటుందని వివరించారు. 50 మందికి ఒకరిని నియమించాలని కోరారు. వీరికి కనీస వేతనం అమలు చేసి ప్రతినెలా 5వ తేదీలోపు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రాంతాల్లో నష్టపోయిన ఆయాలకు రూ.25 వేలు ఆర్థికసాయం అందించాలని కోరారు. డైరెక్టరును కలిసిన వారిలో యూనియన్ నాయకులు హనిమి బాయి, అనూష ఉన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విశాఖపట్టణం : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న అవార్డులు అందజేసేందుకు వీలుగా 2023- 24 సంవత్సరానికి అర్హులైన పర్యాటక రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ బుధవారం తెలిపారు. మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను టూరిజం వెబ్‌సైట్ ఒఒఒ.ఐజు్‌శీబతీఱంఎ.స్త్రశీఙ.ఱఅ నుంచి డౌన్లోడ్ చేసుకుని పూర్తి చేసిన తర్వాత ఎపి టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు ఈ నెల 22లోగా అందజేయాలన్నారు.

ఉత్తమ హోటల్ (5 స్టార్, 4 స్టార్, 3 స్టార్), ఉత్తమ బడ్జెట్ హోటల్, బెస్ట్ వే సైడ్ ఎమినిటీస్, ఉత్తమ హరిత హోటల్, ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్, ఉత్తమ థీమ్ ఆధారిత రిసార్ట్, హోటల్లోని ఉత్తమ రెస్టారెంట్, ఉత్తమ థీమ్ రెస్టారెంట్, ఉత్తమ స్టాండ్-అలోన్ రెస్టారెంట్, ఉత్తమ చెఫ్, ఉత్తమ చెఫ్ (ఆంధ్రా వంటకాలు), ఉత్తమ స్టాండ్-ఒంటరి కన్వెన్షన్ సెంటర్, బెస్ట్ యూనిక్ టూరిజం ప్రాజెక్టు, టూరిస్టు డెస్టినేషన్ ఉత్తమ పౌర నిర్వహణ (పట్టణ, గ్రామీణ ప్రాంతాలు), ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉత్తమ జిల్లా (కలెక్టర్), ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ బీచ్, ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వే స్టేషన్, సినిమా షూటింగ్ ఉత్తమ స్థానం, ఉత్తమ పర్యాటక అనుకూల విమానాశ్రయం, బెస్ట్ టూరిస్టు ఫ్రెండ్లీ బస్ స్టాండ్, స్థానిక పర్యాటక ప్రాజెక్టులు, టూరిజం ప్రాజెక్టు ఉత్తమ సమగ్ర అభివృద్ధి, ఉత్తమ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్ (బోటింగ్), ల్యాండ్, ఏరో, వాటర్ స్పోర్ట్స్ కోసం బెస్ట్ అడ్వెంచర్ ఇన్బౌండ్ టూర్ ఆపరేటర్ (డొమెస్టిక్), అత్యంత వినూత్నమైన ఇన్బౌండ్ టూర్ ఆపరేటర్ (దేశీయ), టూరిజాన్ని ప్రమోట్ చేస్తున్న బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ, ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ, రచన/ప్రచురణలో శ్రేష్ఠత, ఉత్తమ టూరిస్ట్ గైడ్, ఏపీ టూరిజంపై ఉత్తమ చిత్రం, ఉత్తమ పర్యాటక ప్రమోషన్ కొలెటరల్ పబ్లిసిటీ మెటీరియల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యొక్క అత్యంత వినూత్న వినియోగం/ఉత్తమ టూరిజం వెబ్సైట్/పోర్టల్ ప్రమోటింగ్, ఆంధ్రప్రదేశ్ కళ, సంస్కృతి ద్వారా పర్యాటక ప్రచారం, ఎపి టూరిజాన్ని ప్రోత్సహించే ఉత్తమ బ్లాగర్/సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ విభాగాలకు అవార్డులు అందజేయనున్నట్లు వివరించారు.

విశాఖలో అక్కినేని నాగార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగార్జున సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం వచ్చారు. బుధవారం సాయంత్రం పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, గుడివాడలో తన తండ్రి అక్కినేని నాగేశ్వరావు కట్టించిన కాలేజీలో చదివి ఉన్నతస్థాయికి చేరిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తమ కుటుంబానికి ఎంతో సహాయం చెయ్యటం, తమ కుటుంబ సభ్యులలో ఒకరిగా ఉండటం వల్ల అయనపై అభిమానంతో కలవటానికి వచ్చానని చెప్పారు. అక్కినేని నాగార్జునను కలసిన వారిలో డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఆచార్య వి.బాల మోహనదాసు, పైడా కృష్ణప్రసాద్, నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు తదితరులు ఉన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking

నాగార్జున నగర్ బ్రాంచ్ (6080)
48-13-1/4A, శ్రీరామచంద్రనగర్, నాగార్జుననగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

7	యూని కోడ్:-డిఎస్ఎల్ఎ00000992 బ్రాంచ్ పేరు: విజయవాడ **రుద్ర గంగరాజు ఆస్తి చిరునామా:** ఇంటి నెం.21-1-108/3, ఎన్టీఆర్ కాలనీ (నౌలూరు), వార్డ్ నం.21, ఫ్లాట్ నెం.19, మంగళగిరి, మంగళగిర్, లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, తాడేపలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503. **రుద్రు గంగరాజు నివాస చిరునామా:** డోర్ నెం.1-123, ఆరోహ్య కాలనీ, నౌలూరు రూరల్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522503. **రుద్రూ గంగరాజు ఆఫీసు చిరునామా:** గంగమ్మ తల్లి డైరీ ఫామ్, డి. నెం.1-123, ఆరోహ్య కాలనీ, నౌలూరు రూరల్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522503. **రుద్రూ సాంబశివ రావు,** డి. నెం.1-123, ఆరోహ్య కాలనీ, నౌలూరు రూరల్, బిగుంటూరు, ఆంధ్రప్రదేశ్-522503	ఇంటి నెం.21-1-108/3, ఎన్టీఆర్ కాలనీ (నౌలూరు), వార్డ్ నం.21, ఫ్లాట్ నెం.19, మంగళగిరి, మంగళగిర్, లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, తాడేపాల్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503లోగల ఆస్తి మొత్తం భాగం.	రూ. 1204190.82/- కొరకు 28-మే-24	16-09-2024
8	యూని కోడ్ & యాప్ ఐడి: 02400007008801889921 బ్రాంచ్ పేరు: విజయవాడ **శేఖర్ బాబు యలమంచిలి ఆస్తి చిరునామా:** డోర్ నెం.7-144 దగ్గర, ఫ్లాట్ నెం.202, గ్రౌండ్ ఫ్లోర్, బృందావనం రెసిడెన్సీ, హమీద్ స్ట్రీట్ నియర్ ఓల్డ్ మస్జిద్, విజయవాడ రూరల్, నిడమనూరు కృష్ణ జిల్లా, కృష్ణ ఆంధ్ర ప్రదేశ్ 521104. **శేఖర్ బాబు యలమంచిలి నివాస చిరునామా:** డి.నెం.5-44/3, వై వెంకటరత్నం నిలయం, రాజ్‌కమల్ మోడ్రెన్ రెసిడెన్సీ ఎదురుగా, కానూరు, విజయవాడ కృష్ణ ఆంధ్రప్రదేశ్:- 520007. **శేఖర్ బాబు యలమంచిలి ఆఫీసు చిరునామా:** మెసర్స్ సత్య ఇంజినీరింగ్ వర్క్స్, ఫ్లాట్ నెం:12, బ్లాక్ నెం:బి3, ఆటోనగర్, కొత్త ఆటో నగర్, కానూరు, విజయవాడ, కృష్ణా, ఆంధ్రప్రదేశ్ 520007. **సత్య శ్రీ యలమంచిలి,** డి.నెం.5-44/3, వై వెంకట రత్నం నిలయం, ఎదురుగా రాజ్‌కమల్ మోడ్రెన్ రెసిడెన్సీ, కానూరు, విజయవాడ కృష్ణా ఆంధ్రప్రదేశ్:-520007	డోర్ నెం. 7-144, ఫ్లాట్ నెం 202, గ్రౌండ్ ఫ్లోర్, బృందావనం రెసిడెన్సీ, హమీద్ వీధి పాత మసీదు దగ్గర, విజయవాడ రూర్, నిడమనూరు కృష్ణా జిల్లా, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521104లోగల ఆస్తి మొత్తం. ఉత్తరం: ఫ్లాట్ నెం.203, పశ్చిమం: ఒపెన్ టు స్కై, తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం: ఫ్లాట్ నెం.201	రూ. 3054020/- కొరకు 27-మే-24	13-09-2024
9	యూని కోడ్: హెచ్ఎల్ఎస్ఎ0000ఎఫ్ఇ37 బ్రాంచ్ పేరు: విజయవాడ **వక్కలగడ్డ మీనా ఆస్తి చిరునామా:** ఆర్.ఎస్.నెం.55/3, డి.నెం,..3-183, ఫ్లాట్ నెం.9, అసెస్‌మెంట్ నెం.853, చిల్లకలు గ్రామం, జిఎస్ఆర్ గార్డెన్స్ దగ్గర, జగ్గయ్యపేట్ మండలం, చిలకలు గ్రామం, 55/3, చిల్లకల్లు నగర్ గ్రామం మరియు గ్రామ పంచాయితీ, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521175. **వక్కలగడ్డ మీనా, నివాస చిరునామా:** డి. నెం.13, 165, తుమ్మపల్లి వెంకట్ అపార్ట్‌మెంట్, ముక్త్యాల ఆటో స్టాండ్ఎదురుగా, జగ్గయ్యపేట , ముక్త్యాల రోడ్ , కృష్ణా , ఆంధ్ర ప్రదేశ్ 521175. **వక్కలగడ్డ మీనా ఆఫీస్ చిరునామా:** డోర్ నెం.6- 59-5, కోదాడ రోడ్, జగ్గయ్యపేట మండల్ , ఆంధ్రా బ్యాంక్ ప్రక్కన, జగ్గయ్యపేట, కృష్ణ , ఆంధ్ర ప్రదేశ్ - 521175, **వక్కలగడ్డ రాజు,** డి. నెం.13, 165, తుమ్మపల్లి వెంకట్ అపార్ట్‌మెంట్, ముక్త్యాల ఆటో స్టాండ్ఎదురుగా, జగ్గయ్యపేట , ముక్త్యాల రోడ్ , కృష్ణా , ఆంధ్ర ప్రదేశ్ 521175.	ఆర్ఎస్ నెం.55/3, డి.నెం.3-183, ఫ్లాట్ నెం.9, అసెస్‌మెంట్ నం.853, చిల్లకల్లు గ్రామం, జిఎస్ఆర్ గార్డెన్స్ దగ్గర, జగ్గయ్యపేట్ మండలం, చిలకలు గ్రామం, 55/ 3, చిలకలు నగర్ గ్రామం మరియు గ్రామ పంచాయితీ, కృష్ణా, ఆంధ్రప్రదేశ్- 521175.	రూ. 4832795/- కొరకు 28-మే-24	17-09-2024
10	యూని కోడ్ & యాప్ ఐడి:- 10600001137 & 01528219 బ్రాంచ్ పేరు: గుంటూరు **వెంకట సుబ్బా రెడ్డి ఆరుమళ్ల ఆస్తి చిరునామా:** ఫ్లాట్ నెం.304, బ్లాక్- సి, రెండవ అంతస్తు, డి.నెం.578/1, తిరుమల గార్డెన్, పాత గుంటూరు, మానస సరోవరం పార్క్ దగ్గర నందివెలుగు రోడ్, గుంటూరు ఆంధ్ర ప్రదేశ్ :-522004. **వెంకట సుబ్బా రెడ్డి ఆరుమళ్ల, నివాస చిరునామా:** డినెం.5-30-14, రైల్‌పేట, ఇండియన్ బ్యాంక్ రోడ్, ఇండియన్ బ్యాంక్ ఎదురుగా, రేపల్లె గుంటూరు ఆంధ్ర ప్రదేశ్ -522265. **వెంకట సుబ్బా రెడ్డి ఆరుమళ్ల, ఆఫీస్ చిరునామా:** కళ్యాణి కమ్యూనికేషన్స్, డోర్ నెం: 5-30-14, ఇండియన్ బ్యాంక్ ఎదురుగా, రేపల్లె, రేపల్లె గుంటూరు ఆంధ్రప్రదేశ్ :- 522262. **లక్ష్మీ ఆరుమళ్ల,** డి.నెం.5-30-14, రైలుపేట, ఇండియన్ బ్యాంక్ రోడ్, ఇండియన్ బ్యాంక్ ఎదురుగా, రేపల్లె గుంటూరు ఆంధ్రప్రదేశ్ -522265	ఫ్లాట్ నెం.304, బ్లాక్ సి, రెండవ అంతస్తు, డోర్ నెం.578/1, తిరుమల గార్డెన్, పాత గుంటూరు, మానసల్ సరోవరం పార్క్ దగ్గర, నందివెలుగు రోడ్, గుంటూరు గుంటూ, ఆర్ ఆంధ్రప్రదేశ్-522004లోగల ఆస్తి మొత్తం భాగం. ఉత్తరం: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కైతూర్పు: కామన్ కారిడార్, దక్షిణం: ఒపెన్ టు స్కై	రూ. 3777078/- కొరకు 27-మే-24	16-09-2024

తేది : 19.09.2024 | సం/- (అధీకృత అధికారి)
ప్రదేశం : విజయవాడ | పిరమల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

దీపావళి నుంచి ఉచిత గ్యాస్

- స్టీల్‌ప్లాంటును కాపాడే బాధ్యత మాదే
- 'ఇది మంచి ప్రభుత్వం'పేరుతో రేపటి నుంచి ప్రచారం
- టిడిపి కూటమి సమావేశంలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూపర్ సిక్స్ హామీలో భాగంగా ఉచిత గ్యాస్ అందిస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీపావళి రోజు తొలి కనెక్షన్ ఇచ్చేందుకు శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. టిడిపి కూటమి ప్రభుత్వ పాలన 100 రోజులు సందర్భంగా కూటమి ఎంపి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల సమావేశం మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో బుధవారం జరిగింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ. విశాఖ స్టీల్‌ప్లాంటును సమస్యగా సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని వైసిపిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈ ప్లాంటు ఇబ్బందుల్లో ఉంటే తామే కాపాడామని చెప్పారు. ఇప్పుడు కూడా ఇబ్బందుల్లో ఉందని మరలా మరోసారి కాపాడే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటాయని వెల్లడించారు. రాష్ట్రంలో పెండింగ్ ఒథకత నిర్మాణాలనూ పూర్తి చేస్తామన్నారు. గ్రామల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున స్థలాలు అందించి నిర్మాణానికి రూ.4 లక్షలు కేటాయిస్తామన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలను రాజముద్రతో రైతులకు అందిస్తామన్నారు శుక్రవారం నుంచి 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో 26వ తేదీ వరకు ప్రచారం నిర్వహించాలన్నారు.

టిడిపి కూటమి ప్రభుత్వ పాలనకు100 రోజులు పూర్తిఅయిన సందర్భంగా మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

తిరుమల ప్రసాదంలో జంతువుల కొవ్వు

తిరుపతి ఆలయంలో ప్రసాదాన్ని అపవిత్రం చేసేలా నాసిరకమైన పదార్థాలతో పాటు జంతువుల కొవ్వును కూడా వైసిపి హయాంలో ఉపయోగించారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. నాసిరకం లడ్డూ తయారు చేశారన్నారు. అనేక సార్లు ఫిర్యాదు చేసినా మారలేదని, ఎంతో దుర్మార్గంగా ప్రవర్తించారని అన్నారు. అన్నదాన్నంలో కూడా ఆహారం నాణ్యత లేదన్నారు. నెయ్యికి బదులు ఈ కొవ్వును వాడారని చెప్పారు. ఇప్పుడు స్వచ్ఛమైన నెయ్యి తీసుకొచ్చి నాణ్యతను పెంచామని, ఇంకా పెంచుతామని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే అభిమతం: పవన్‌కల్యాణ్

పార్టీలు వేరైనా తమ అభిమతం రాష్ట్రాభివృద్ధి అని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో ప్రజల కోసమే ఆలోచన చేసిందని, వారికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడంపై దృష్టిపెట్టిందని చెప్పారు. గ్రామ స్వరాజ్యం వైపు వేగంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. ప్రతిఒక్కరూ ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యలు తీర్చేందుకు పనిచేయాలని పిలుపునిచ్చారు.. గత ప్రభుత్వ నిధుల వినియోగం విషయంలో పల్స్ సర్వే నిర్వహించి తప్పులు ఎక్కడ జరిగాయో తెలుసుకుంటున్నామని చెప్పారు.

విజయవాడకు వచ్చిన వరదల వేళ విమర్శలు తప్ప వైసిపికి బాధ్యత లేదని విమర్శించారు. రాష్ట్రం ఆర్థికంగా గడ్డు పరిస్థితిలో ఉన్నా, ధైర్యంగా పించన్ పెంచామన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి మాట్లాడుతూ.. రాష్ట్రానికి అన్ని విధాలా సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రాన్ని జగన్ ఇబ్బంది పెడుతున్న తీరును ప్రజలకు వివరిస్తూ మరోవైపు కూటమి ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

రూ. 350 కోట్లకు ప్రతిపాదనలు

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రానికి రూ.350 కోట్లకు ప్రతిపాదనలు సమర్పించామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం నాడిక్కడ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీతోనూ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో మంత్రి బిసి జనర్ధన్ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం జనార్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారులకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరినట్లు చెప్పారు. కేంద్ర రోడ్లు మౌలిక సదుపాయాల నిధి (సిఆర్ఐఎఫ్) కింద ఇప్పటికే రూ. 350 కోట్లకు ప్రతిపాదనలు సమర్పించామని, అధనంగా మరో రూ.150 కోట్ల నిధుల విడుదలకు కేంద్ర మంత్రి హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో రహదారులకు సంబంధించి స్థానిక సమస్యలను కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించి, పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేసే దిశగా ముందుకు వెళుతున్నామని అన్నారు. అమరావతిలో కట్టడాలు, రహదారులు, రాజధాని ఓఆర్ఆర్, ఎన్‌హెచ్ 544డి మొదలైన వాటికి సమగ్రమైన నివేదికలు సిద్ధం చేసి కేంద్ర మంత్రికి త్వరలోనే సమర్పిస్తామని అన్నారు. ఇటీవలి వరదలలో దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తుకు రూ.186 కోట్లతో అంచనాలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. రూ.296 కోట్ల నిధులతో రహదారులపై గుంతల పూడ్చివేత తదితర మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం తమ శాఖలో భూమి, మైనింగ్, అటవీ సంబంధిత విషయాలు, సమస్యలపై చర్చించడానికి అధికారులతో త్వరలోనే సమీక్షాసమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారులు రామచంద్ర, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై ముఖ్యమంత్రి వాగ్దానం నిలబెట్టుకోవాలి

- అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి డిమాండ్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం), ఉక్కునగరం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం వెలగపూడిలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ గురించి చేసిన ప్రకటనలు, వాగ్దానాలను ఆచరణలో చూపాలని విశాఖ జిల్లా అఖిలపక్ష, కార్మిక, ప్రజాసంఘాల జెఎసి డిమాండ్ చేసింది. విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ భోగవిల్లి నాగభూషణం, కన్వీనర్లు ఎస్.కనకారావు, ఎం.వెంకటేశ్వర్లు, దొమ్మేటి అప్పారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటుపరం కానివ్వబోమని, ఇది రాష్ట్రానికి సెంటిమెంటని, కాపాడుకుంటామని, టిడిపికి, ఎన్‌డిఎకు విశాఖ గట్టి కేంద్రమని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం తమ బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడాన్ని జెఎసి స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలో ప్రయివేటు స్టీల్‌ప్లాంట్లు బాగున్నాయని, మంచి ప్లాంట్ అయిన వైజాగ్ స్టీల్ ఎందుకు నష్టాలు పాలవుతుందో ఆలోచించాలని, లాభాలు బాటపట్టేందుకు అందరు కష్టపడాలని సిఎం పేర్కొన్నారని చెప్పారు. విశాఖ ఉక్కుకు సొంత ఇనుప గనులు కేంద్రం కేటాయించలేదని, ప్రతి టన్ను ఉక్కు ఉత్పత్తికీ రూ.4 వేలు అదనపు భారం పడుతోందని, విశాఖ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 21 వేల టన్నులు కాగా, ప్రస్తుతం ఐదు వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోందని జెఎసి నాయకులు తెలిపారు. ముడిసరుకులేక మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌ల్లో రెండింటిని మూతవేశారన్నారు. ప్లాంటు విస్తరణ ఉత్పత్తి సామర్థ్యం 3.4 మిలియన్ టన్నులు నుంచి 7.3 మిలియన్ టన్నులకు విస్తరణ జరిగిందని, ఇందుకు కేంద్రం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. దీంతో, రూ.20 వేల కోట్లను స్టీల్‌ప్లాంట్ అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. నష్టాలకు, అప్పులకు ప్రధాన కారణాలు ఇవని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్టీల్‌ప్లాంటు ఇంతవరకు పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ.54 వేల కోట్లు అందించిందని తెలిపారు. ప్లాంటు నడవడానికి ప్రస్తుతం రూ.11 వేల కోట్లు వర్కింగ్ కేపిటల్ అవసరమని చెప్పారు. ఉద్యోగుల సంఖ్యను 19 వేలు నుంచి 12,700కు కుదించారని, ఖాళీలు భర్తీ చేయడంలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నష్టాలకు, అప్పులకు కారణం యాజమాన్యం, కార్మికులు కాదని, కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ఎడల అనుసరిస్తోన్న కుట్రపూరిత వైఖరేనని వివరించారు. ప్లాంటును కావాలనే ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి తన అనుయాయులైన కార్పొరేట్లకు కట్టబెట్టాలన్న పథకంతో ముందుకు వెళ్తుందన్నారు. విశాఖ ఉక్కు లాభాల బాట పట్టాలంటే అందరూ కష్టపడాలని ముఖ్యమంత్రి ప్రకటించారని ఈ సందర్భంగా నాయకులు ప్రస్తావించారు. అధికారులు, పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులు కష్టపడుతున్నారని, కేంద్రం ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించినప్పుడు లాభాల బాట పట్టించారని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ లాభాలు బాట పట్టిస్తారన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సొంత ఇనుప గనులు, వర్కింగ్ కేపిటల్ కేటాయించేలా, సెయిల్‌లో విలీనం చేసేలా, ప్లాంటును పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిపించేలా, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చేలా, అధికారులు, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా అఖిలపక్ష, కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ జగ్గునాయుడు

కార్మిక సంఘాలతో ఇన్‌ఛార్జి సిఎండి సమావేశం నేటికి వాయిదా

ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చిన స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎండి ఎకె.బాగ్చి బుధవారం కార్మిక సంఘాల నేతలతో సమావేశం అయ్యేందుకు ఆహ్వానించారు. ఢిల్లీ నుంచి వచ్చిన శుభవార్త చెప్తారని కార్మిక సంఘాల నేతలు ఆశాభావంతో ఉన్నారు. అయితే, ఢిల్లీ నుంచి మరోసారి పిలుపు రావడంతో హుటాహుటిన మంగళవారం రాత్రి ఆయన మళ్లీ ఢిల్లీకి ప్రయాణమయ్యారు. దీంతో, కార్మిక సంఘాలతో సమావేశం గురువారానికి వాయిదా పడింది.

ఆంధ్రాకు నలుగురు ఐపిఎస్ అధికారులు

- ఎన్‌పిఎ డైరెక్టర్ అమిత్ గార్గ్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు నలుగురు చొప్పున యువ ఐపిఎస్ అధికారులు కేటాయించబడ్డారని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్‌విపిఎన్‌పిఎ) డైరెక్టర్ అమిత్ గార్గ్ తెలిపారు. వారిలో ముగ్గురు మహిళా ఐపిఎస్‌లు ఉన్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రాకు కేటాయించడిన నలుగురిలో ఇద్దరు ఆంధ్రా వారు కాగా ఒకరు తమిళనాడు, మరొకరు హర్యానాకు చెందిన వారు ఉన్నారని చెప్పారు.

గత ఏడాది కాలంలో శిక్షణ నిమిత్తం అకాడమీకి వచ్చిన 188 మంది ఐపిఎస్ అధికారులకు శాంతిభద్రతల పరిరక్షణ, నేర నిరోధం, ఫోరెన్సిక్ సైన్స్, భారత నూతన చట్టాలు, ఉగ్రవాదం, తీవ్రవాదంతో పాటు పెరిగిపోతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా నిరోధంపై కట్టుదిట్టమైన శిక్షణనివ్వటం జరిగిందని వివరించారు. శుక్రవారం దీక్షాంత్ పరేడ్ ఉంటుందని, ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు. వైద్య వృత్తి నుంచి సివిల్ సర్వీస్‌లోకి, అది కూడా ఐపిఎస్ అధికారులుగా ఎంపిక కావటం వెనక ప్రజలకు పోలీసు శాఖ ద్వారా అన్ని విధాలుగా న్యాయం చేయవచ్చనే తమ లక్ష్యం ఉన్నదని పలువురు యువ ఐపిఎస్ అధికారులు తెలిపారు. విలేకరుల సమావేశంలో అమిత్ గార్గ్‌తో పాటు జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికలు
కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

చండీగఢ్ : త్వరలో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోను తాజాగా విడుదల చేసింది. ఎంఎస్‌పికి చట్టబద్ధత, కులగణన సర్వేతో పాటు ఏడు హామీలను కాంగ్రెస్ ఇచ్చింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏడు హామీలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఖర్గేతోపాటు, కాంగ్రెస్ హర్యానా చీఫ్ ఉదయ్ భాన్, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, హర్యానా ఎన్నికల ఎఐసిసి పరిశీలకులు అశోక్‌గెహ్లాట్, అజయ్ మాకెన్, ప్రతాప్‌సింగ్ బజ్వాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. 'ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రటించిన ఈ హామీలకు 'సాత్ వాదే, పక్కే ఇరాదే' అనే పేరుపెట్టాం. మేము ప్రకటించిన ఈ హామీలను కచ్చితంగా అమలు చేస్తాం. అందుకే ఈ హామీలకు ఈ పేరు పెట్టాం' అని ఆయన అన్నారు. ఈ హామీల ప్రకారం మహిళా సాధికారిత కింద గ్యాస్ సిలిండర్ రూ. 500లకే కాంగ్రెస్ ఇవ్వనుంది. ప్రతినెలా 18-60 ఏళ్ల లోపు ఉన్న మహిళలందరికీ రూ. 2000 ఇస్తామని ఆ పార్టీ వాగ్దానం చేసింది.సామాజిక భద్రతను బలోపేతం చేయడానికి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ప్రతినెలా రూ.6 వేలు పెన్షన్. అలాగే ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 25 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స, కులగణన చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కులగణనలో సర్వేలో క్రిమీ లేయర్ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అక్టోబర్ 5వ తేదీన హర్యానా ఎన్నికలు జరగనుండగా, 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలవడనున్నాయి.

21న ఢిల్లీ సిఎంగా అతిషి ప్రమాణం..!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషి మర్లేనా ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారం విషయంపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమాచారం ఇచ్చారు. అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం సిఎం పదవికి రాజీనామా చేయడం, అతిషిని కొత్తగా సిఎంగా ఎన్నుకోవడం తెలిసిందే. కొత్త ప్రభుత్వంలో ఎవరికి కేబినెట్‌లో చోటు దక్కుతుందనే చర్చ జోరుగా సాగుతుంది. కేబినెట్‌లో పాత మంత్రులతో పాటు మరో కొత్త ముఖాలకు సైతం ఛాన్స్ దక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న పదవులపై ప్రాంతీయ, కుల సమీకరణాలు సమతూకంపై పార్టీ కసరత్తు చేస్తున్నది. షెడ్యూల్డ్ కులానికి చెందిన ఒకరికి మరొకరికి అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే, ప్రస్తుత మంత్రివర్గాన్ని మార్చేందుకు సిఎం సానుకూలంగా లేరనే సమచారంతో ప్రస్తుత మంత్రులకు మంత్రివర్గంలో చోటు దక్కవచ్చని భావిస్తున్నారు. కేబినెట్ బెర్తుల కోసం పలువురు ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు. సోమనాథ్ భారతి, దుర్గేష్ పాఠక్, సంజీవ్ ఝా, దిలీప్ పాండే, మహేంద్ర గోయల్ జనరల్ కేటగిరిలో పోటీలో ఉన్నారు.

కేరళలో మంకీపాక్స్ రెండో కేసు నమోదు

కోచి : కేరళలో రెండవ మంకీ పాక్స్ కేసు నమోదైంది. యుఎఇ నుండి ఇటీవలల వచ్చిన వ్యక్తిలో ఈ వైరస్‌కు సంబంధించిన లక్షణాలు వున్నట్లు డాక్టర్లు ధృవీకరించారు. కేరళలోని ఉత్తర మలప్పురం జిల్లాలో ఇప్పటికే ఆస్పత్రిలో చేరిన 38ఏళ్ళ వ్యక్తికి ఎంపాక్స్ ఇన్ఫెక్షన్‌కు చికిత్సను అందిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ బుధవారం తెలిపింది. రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జి ఈ మేరకు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. విదేశాల నండి వచ్చేవారు ఎలాంటి లక్షణాలు కనబడినా వెంటనే ఆస్పత్రులకు వెళ్ళాలని, ప్రభుత్వానికి విషయం తెలియచేయాలని మంత్రి కోరారు. సాధ్యమైనంత త్వరగా చికిత్స తీసుకోవాలని కోరారు. తాజా కేసులో వ్యక్తి లక్షణాలు కనిపించిన వెంటనే ఎవరితో కలవకుండా ఒంటరిగా వుండి తర్వాత ఆస్పత్రిలో చేరాడని తెలిపారు. ఆ వ్యక్తి నమూనాలను పరీక్షకు పంపామని, బుధవారం ఎంపాక్స్ పాజిటివ్ వచ్చిందని చెప్పారు. సాధారణంగా రెండు నుండి నాలుగు వారాల పాటు వుండే ఈ ఇన్ఫెక్షన్ పక్కవారికి సోకే అవకాశాలు తక్కువ. స్వల్ప వైద్య చికిత్సలతో తగ్గిపోతుంది. జ్వరం, దద్దుర్లు, లింఫ్ నోడ్‌లు వాచడం వంటి లక్షణాలు వుంటాయి.

రబీలో ఎరువులపై సబ్సిడీ

- చంద్రయాన్ మిషన్‌కు లైన్‌క్లియర్
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

రబీ సీజన్ (2024 అక్టోబర్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు)లో ఫాస్ఫాటిక్ అండ్ పోటాసిక్ ఎరువులపై (పిఅండ్‌కె) రూ.24,475 కోట్ల సబ్సిడీని కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. మధ్యప్రాచ్యం, రష్యా-ఉక్రెయిన్‌లో నెలకొన్న ఘర్షణతో రైతులు సవాళ్ల బారిన పడకుండా ఉండేందుకు సబ్సిడీని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు.

పీఎం అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్, పీఎం ఆశా పథకాలను కొనసాగించడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ పథకాల కోసం 15వ ఫైనాన్స్ కమిషన్ నిర్ణయించిన మేరకు 2025-26 వరకు రూ.35వేలకోట్లు ఖర్చు చేయనున్నారు. రైతులకు లాభదాయకమైన ధరలను అందించడానికి, వినియోగదారులకు నిత్యావసర వస్తువుల ధరల అస్థిరతను నియంత్రించడానికి ఈ పథకాలు అమలు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ అండ్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) కోసం నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఓఈ) ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.

బయోటెక్నాలజీలో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధికి తోడ్పడేందుకు 'బయో-రైడ్' పథకానికి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ) రెండు పథకాల కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. బయో మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ బయో ఫౌండ్రీ అనే కొత్త భాగంతో 'బయోటెక్నాలజీ రీసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బయో-రైడ్)' అనే పథకాన్ని విలీనం చేయనున్నట్టు తెలిపారు. 2021-22 నుంచి 2025-26 వరకు 15వ ఆర్థిక సంఘం కాలంలో ఏకీకృత పథకం 'బయో-రైడ్' అమలుకు ప్రతిపాదిత వ్యయం రూ.9,197 కోట్లు అంచనా వేసిందన్నారు.

ప్రధాన మంత్రి జంజాతి ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద గిరిజన సంక్షేమానికి రూ.79,156 (కేంద్ర వాటా: రూ. 56,333 కోట్లు, రాష్ట్ర వాటా: రూ. 22,823 కోట్లు) కోట్ల పథకానికి ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. 2024-25 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన విధంగా 5 కోట్ల మందికి పైగా గిరిజనులకు ప్రయోజనం చేకూర్చే 63,000 గ్రామాలకు ఇది వర్తిస్తుందన్నారు. ఇది 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 549 జిల్లాల్లోని అన్ని గిరిజన మెజారిటీ గ్రామాలలో విస్తరించి ఉన్న 2,740 బ్లాక్‌లను కవర్ చేస్తుందని అన్నారు.

చంద్రయాన్ మిషన్‌కు లైన్‌క్లియర్

చంద్రునిపై విజయవంతంగా దిగిన తరువాత భూమిపైకి తిరిగి రావడానికి సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి, ప్రదర్శించడానికి, చంద్రుని నమూనాలను సేకరించి వాటిని విశ్లేషించడానికి చంద్రయాన్-4 పేరుతో చంద్రయాన్ మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. చంద్రయాన్-4 మిషన్‌కు రూ.2,104.06 కోట్లు ఖర్చు చేయనుందని తెలిపారు.

అలాగే వీనస్ ఆర్బిటర్ మిషన్ (వీఓఎం) అభివృద్ధికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఇది చంద్రుడు, అంగారక గ్రహాలను దాటి శుక్రుడిని అన్వేషించి, అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు. దీనికి మొత్తం నిధులు రూ.1,236 కోట్లు ఖర్చు చేయగా, అందులో రూ. 824.00 కోట్లు వ్యోమనౌక కోసం ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.

నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ) అభివృద్ధికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఇది భారతీయ అంతరిక్ష్ స్టేషన్‌ను స్థాపించడం, ఇండియన్ క్రూడ్ ల్యాండింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం వంటివి చేస్తుందని అన్నారు. దీనికి రూ.8,240 కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. మూడు అభివృద్ధి విమానాలు, అవసరమైన సౌకర్యాల ఏర్పాటు, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అండ్ లాంచ్ క్యాంపెయిన్ వంటివి ఇందులో భాగంగా ఉన్నాయన్నారు.

గగన్‌యాన్ కార్యక్రమ పరిధిని విస్తరించడంతో భారతీయ అనత్రిక్ష్ స్టేషన్ మొదటి యూనిట్ భవనానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. భారతీయ అంతరిక్ష్ స్టేషన్ (బిఎఎస్-1) మొదటి మాడ్యూల్ అభివృద్ధికి మంత్రివర్గం ఆమోదం ఇచ్చిందని, బీఎఎస్‌ని నిర్మించడానికి, నిర్వహించడానికి వివిధ సాంకేతికతలను ప్రదర్శించడానికి, ధ్రువీకరించడానికి మిషన్లను చేపట్టిందని తెలిపారు. ఇస్రో గగన్‌యాన్ ప్రోగ్రామ్‌లో నాలుగు మిషన్‌లను చేపడుతుందని, 2028 డిసెంబర్ నాటికి బీఎఎస్ మొదటి మాడ్యూల్, బీఎఎస్ కోసం వివిధ సాంకేతికతల ప్రదర్శన, ధ్రువీకరణకు నాలుగు మిషన్లను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే ఆమోదించబడిన ప్రోగ్రామ్‌లో రూ.11,170 కోట్ల నుంచి సవరించిన పరిధితో గగన్‌యాన్ ప్రోగ్రామ్ కోసం మొత్తం నిధులు రూ.20,193 కోట్లకు పెంచినట్లు తెలిపారు.

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

చట్ట సభల ఆమోద ప్రక్రియ ఇప్పటి నుంచే ప్రారంభించాల్సి ఉంటుంది. లోక్‌సభ, శాసనసభల పదవీకాలంపై రాజ్యాంగ నిబంధనలను పార్లమెంట్ సవరించిన తర్వాత అనేక రాష్ట్ర ప్రభుత్వాలు 2029లో...అంటే ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవడానికి ముందే రద్దవుతాయి. జమిలీ ఎన్నికలకు సిద్ధమా కాదా అనేది తేల్చుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని కోవింద్ కమిటీ తెలిపింది.

వీటి పదవీకాలం ఏడాదే

గత సంవత్సరం పది రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. వీటికి 2028లో మళ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే అప్పుడు ఏర్పడే ప్రభుత్వాలు ఒక సంవత్సరమో లేదా అంతకంటే తక్కువ సమయమో మాత్రమే అధికారంలో ఉంటాయి. హిమాచల్ ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, కర్నాటక, తెలంగాణ, మిజోరం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఈ పరిస్థితి ఉంటుంది.

ఇవి రెండూమూడేళ్లే అధికారంలో

ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత ఇచ్చినప్పటికీ ఆ ప్రభుత్వాలు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే మనుగడలో ఉంటాయి. ఈ రాష్ట్రాల శాసనసభలకు 2027లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇక పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ రాష్ట్రాలకు 2026లో ఎన్నికలు జరుగుతాయి కాబట్టి ఆ ప్రభుత్వాలు మూడు, అంతకంటే తక్కువ సంవత్సరాలు అధికారంలో ఉంటాయి. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా ప్రభుత్వాలు మాత్రమే ఐదు సంవత్సరాలు అధికారంలో ఉంటాయి.

కమిటీ ఏం చెప్పింది?

లోక్‌సభ పదవీకాలానికి సంబంధించిన ఆర్టికల్ 83, శాసనసభల పదవీకాలానికి సంబంధించిన ఆర్టికల్ 172ను సవరించాల్సి ఉంటుందని కోవింద్ కమిటీ సూచించింది. సవరణలకు ముందు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ అవుతుంది. సవరణలకు పార్లమెంట్ ఆమోదం లభించకపోతే నోటిఫికేషన్ చెల్లదు. ఒకవేళ జమిలీ ఎన్నికలకు ముందే లోక్‌సభ కానీ, ఏదైనా రాష్ట్ర శాసనసభ కానీ రద్దయితే తాజాగా ఎన్నికలు జరపాలని కమిటీ సిఫార్సు చేసింది. అవి మధ్యంతర ఎన్నికలు అవుతాయి. మిగిలిన పదవీకాలానికి మాత్రమే కొత్త ప్రభుత్వాలు అధికారంలో ఉంటాయి.

ప్రతిఘటన తప్పదు

ప్రస్తుత లోక్‌సభ, రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష కూటముల సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే రాజ్యాంగ సవరణలకు ఆమోదం పొందే విషయంలో మోడీ ప్రభుత్వం గట్టి ప్రతిఘటననే ఎదుర్కోవాల్సి ఉంటుంది. జమిలి ఎన్నికల పేరుతో దేశంలో అధికార కేంద్రీకరణకు మోడీ ప్రభుత్వం, బిజెపి యత్నిస్తున్నాయని ప్రతిపక్ష ఇండియా బ్లాక్ విమర్శించింది. రాజ్యాంగ మార్పులు, ఫెడరలిజంపై వాటి ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది.

12నెలల్లో ఆక్రమిత ప్రాంతాల నుండి వెళ్లిపోండి !

- పాలస్తీనా ముసాయిదా తీర్మానం పిలుపు
- ఆమోదించనున్న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ

న్యూయార్క్ : ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో చట్టవిరుద్ధంగా వుండడాన్ని 12మాసాల్లోగా నిలుపు చేయాలని డిమాండ్ చేస్తూ పాలస్తీనా రూపొందించిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మరికొద్ది గంటల్లో ఆమోదించనుంది. ఐక్యరాజ్య సమితి వార్షిక సమావేశాలకు న్యూయార్క్‌కు ప్రపంచ నేతలు రానున్న నేపథ్యంలో ఈ చర్య ఇజ్రాయిల్‌ను ఏకాకిని చేస్తుంది. ఈ నెల 26న జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రసంగించనున్నారు. అదే రోజు పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ కూడా ప్రసంగిస్తారు.

పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ ఆక్రమణలు, అక్రమ ఆవాసాల నిర్మాణం అంతా చట్టవిరుద్ధమని, అక్కడ నుండి వెంటనే వైదొలగాలని జులైలో అంతర్జాతీయ న్యాయస్థానం పేర్కొంది. ఆ తీర్పును ముసాయిదా తీర్మానం స్వాగతించనుంది. సాధ్యమైనంత త్వరగా ఈ తీర్పును అమలు చేయాలని కోరింది. జనరల్ అసెంబ్లీ ముసాయిదా తీర్మానం మాత్రం 12మాసాల గడువును ఇస్తోంది. ఈ నెల్లో పాలస్తీనాకు అదనపు హక్కులు, బాధ్యతలు లభించిన నేపథ్యంలో మొదటిసారిగా పాలస్తీనా అథారిటీ లాంఛనంగా ఈ ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అసెంబ్లీ హాల్‌లో ఐక్యరాజ్య సమితి సభ్యుల మధ్య ఒక సీటును పాలస్తీనాకు కేటాయించడంతో పాటూ ముసాయిదా తీర్మానాలు ప్రతిపాదించే హక్కు కూడా పాలస్తీనాకు లభించింది. "ప్రతి దేశానికి ఒక ఓటు వుంది. యావత్ ప్రపంచం మనల్ని వీక్షిస్తోంది." అని పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ మంగళవారం వ్యాఖ్యానించారు. మంచి చరిత్ర వైపు నిలబడండి. అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా వ్యవహరించండి.

స్వేచ్ఛా, శాంతిలతో జీవించండి." అని వ్యాఖ్యానించారు. కాగా ఇజ్రాయిల్ రాయబారి డేనీ డానన్ జనరల్ అసెంబ్లీ తీరును తీవ్రంగా విమర్శించారు. అక్టోబరు 7నాటి దాడిని ఖండించడంలో జనరల్ అసెంబ్లీ విఫలమైందన్నారు. పాలస్తీనా ముసాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. ఇది దౌత్య తీవ్రవాదమన్నారు. వారధులను నిర్మించడానికి కాకుండా ధ్వంసం చేయడానికి దౌత్యాన్ని ఒక సాధనంగా వాడుతున్నారని విమర్శించారు.



గాజాలో 20మంది మృతి

గాజా : ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో గత 24గంటల్లో 20మంది పాలస్తీనియన్లు మరణించారు. తూర్పు గాజా నగరంలోని ఉజయ ప్రాంతంలో గల స్కూలును లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ఆర్మీ దాడులు జరిపింది. ఈ దాడిలో 8మంది మరణించగా, అనేకమంది గాయపడ్డారు. స్కూలు ఆవరణలో హమాస్ కమాండ్, కంట్రోల్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకునే తాము ఈ దాడి జరిపామని ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి పౌర సదుపాయాలను తీవ్రవాద కార్యకలాపాలకు ఒక పద్ధతి ప్రకారం హమాస్ ఉపయోగిస్తుందనడానికి ఇదొక ఉదాహరణ అని ఆర్మీ ప్రకటన పేర్కొంది. అయితే అందుకు గల సాక్ష్యాధారాలను చూపలేదు

వేగుచుక్క ఏచూరి..

మొదటి పేజీ తరువాయి

విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఒక సిద్ధాంతాన్ని నమ్మి, దేశ రాజకీయాలు దాని చుట్టూ తిరిగేలా, ఆ సిద్ధాంతాన్ని అందరికీ దగ్గరయ్యేలా చేసిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉన్న వారందరినీ ఏకతాటిపైకి తేవడంలో ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. ఆర్‌ఎస్ఎస్ నాయకులు కూడా ఏచూరికి నివాళి అర్పించాల్సిన పరిస్థితి వచ్చిందంటే, ఆయన దేశ రాజకీయాల్లో చూపిన ప్రభావం అర్థమవుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర కోశాధికారి కెవి.చౌదరి, సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, తిరుపతి బాలోత్సవం చైర్మన్ టెంకాయల దామోదరం, సిపిఎం, సిపిఐ నాయకులు టి.సుబ్రమణ్యం, డి.జనార్ధన్, వామపక్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లూరులో ...

నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సీతారాం ఏచూరి సంతాప సభలో వివిధ రాజకీయ పక్షాలు నివాళులర్పించాయి. ముఖ్యఅతిథిగా వి.శ్రీనివాసరావు హాజరయ్యారు. డిసిసి అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మీకోసం

లవంగం పొడిని గుడ్డలో చుట్టి వాసన పీలుస్తూ ఉంటే తలనొప్పి తగ్గుతుంది.

జీవన సౌరభం

విమర్శిస్తున్నారని, విఫలమయ్యామని ప్రయత్నాలు ఆపేసి ఉంటే ఇన్ని అద్భుతాలు సాధించేవాళ్లం కాదు.

మనసు తెల్లన

ఆకాశంలో ఎగురుతున్న కాకికి కింద పచ్చని చెట్టు ఆకర్షించింది. అంతే! ఆ చెట్టుపై వాలింది. అక్కడే చెట్టు తొర్రలో బుజ్జి పిల్లలతో ఉన్న చిలుక "ఈ చెట్టు నాది. నువ్వు ఇక్కడ ఉండొద్దు. నీ రంగు చూడలేను. నీ అరుపు వినసొంపుగా ఉండదు. నా పిల్లలు భయపడతాయి" అన్నది.

చిలుక మాటలకు కాకి మొహం చిన్నబోయింది. చేసేదేమీలేక మరో చెట్టు మీద గూడు కట్టుకుంది. ఎండాకాలం రావటంతో చిలుక నివాసం ఉన్న చెట్టు ఆకులు రాలిపోయాయి. చెట్టు కూడా ఎండిపోవచ్చింది. నివాసం మార్చాలని చిలుక నిర్ణయించుకుంది. పచ్చని చెట్టు కోసం వెతకసాగింది. ఇది గమనించిన కాకి తన చెట్టు మీదకు రమ్మని చిలుకను ఆహ్వానించింది. గర్వంతో ఉన్న చిలుక తిరస్కరించింది.

ఒకరోజు చిలుక పిల్లలకు పండ్లు తెచ్చేందుకు బయలుదేరింది. పిల్లలకు జాగ్రత్తలు చెప్పి వెళ్లింది. చిలుక అలా వెళ్లగానే ఓ వేటగాడు వచ్చాడు. వాడికి చెట్టు తొర్రలో చిలుక పిల్లలు కనపడ్డాయి. వాటికి ఇంకా రెక్కలు కూడా రాలేదు. అవి ఎగరలేవని గ్రహించి వాటిని పట్టుకునేందుకు చెట్టు ఎక్కసాగాడు. దూరం నుంచి ప్రమాదం గ్రహించింది కాకి. వేగంగా ఎగురుకుంటూ వచ్చి చిలుక పిల్లలను తన కాళ్ల మధ్య ఉంచుకొని మరో చెట్టు మీదకు తీసుకుపోయింది. వేటగాడికి కాకి మీద కోపం వచ్చింది. అయినా ఏం చెయ్యలేక వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత వచ్చిన చిలుకకు తన పిల్లలు కనపడకపోవటంతో ఆందోళన చెందింది. చుట్టుపక్కల వెతికింది. చెట్టుపై కాకి కూడా కనపడలేదు. కాకి తన పిల్లలను చంపేసి ఉంటుందని భావించి కన్నీరు కార్చింది. మనసులో దానిని తిట్టుకుంది. సాయంత్రానికి కాకి చిలుక పిల్లలతో వచ్చింది. వాటిని చిలుక నివాసం దగ్గర వదిలింది.

చిలుక పిల్లలను దగ్గరకు తీసుకుంది. అవి వేటగాడి బారి నుంచి కాకి రక్షించిన విషయాన్ని వివరించాయి. చిలుక సిగ్గుపడింది. కాకిని ఉద్దేశించి 'నీ రంగును .. నీ అరుపును హేళన చేశాను. నా చెట్టు మీద ఉండొద్దు అన్నాను. నిన్ను అపార్థం చేసుకున్నాను. నన్ను మన్నించు. రంగు కన్నా అరుపు కన్నా మనసు ప్రధానమని తెలుసుకున్నాను. నువ్వు నలుపైనా నీ మనసు తెల్లన. నీ చెట్టు పైనే మనమంతా కలిసుందాం' అన్నది. చిలుకలో వచ్చిన మార్పుకు కాకి సంతోషించింది.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర,
94923 09100.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో 8 తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ



జె.లక్ష్మీ చాందిని,
8వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి,
గుంటూరుజిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీదికొస్తే పంచ్ పడుద్ది...

ఆత్మరక్షణే ఆయుధంగా కరాటే

యా హూ.. కియా అంటూ పంచులు విసురుతూ... ప్రత్యర్థి విసిరే కిక్‌ను బ్లాక్ చేస్తూ కరాటేలో ప్రతిభను ఈ బాలికలు చాటుతున్నారు. కరాటేలో కఠోర సాధన చేస్తున్నారు. గమనం.. గమ్యం ఒకటిగా చేసుకుని లక్ష్యసాధనలో అడ్డంకులను ఎదుర్కొంటూ కరాటేలో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. పిల్లల పట్టుదల, కృషిని గుర్తించిన తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించటం, శిక్షకులు ప్రత్యేక చొరవ చూపుతుండటంతో విద్యార్థినులు ముందుకెళు_న్నారు. ఉద్యోగాకావాశాలే కాదు. ఆత్మరక్షణ, ఆరోగ్యం కోసం కరాటే అవసరమనే వాస్తవాన్ని వారు గ్రహించారు. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణా, కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు.

బాలబాలికల్లో ఆత్మవిశ్వాసం, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని పెంపొందించటానికి గాను గత కొన్నేళ్లుగా గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని కుంచనపల్లి, పాతూరు గ్రామాల్లోని అరవింద విద్యాసంస్థల ప్రాంగణాల్లో బాలికలకు కరాటే శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. మూడు బ్యాచ్‌లుగా బాలికలు చేస్తున్న విన్యాసాలు అబ్బుర పర్చేలా ఉన్నాయి. నిరాయుధంగా బాలబాలికలు తమను ఎలా స్వీయరక్షణ చేసుకునేలా అరవింద హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.ఇంద్రాణి పర్యవేక్షణలో కోచ్ సిహెచ్.మహేష్ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో ఇక్కడి విద్యార్థినులు చక్కగా తర్ఫీదు పొందుతూ చక్కటి ఫీట్లు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. కనుమూసి, తెరిచేలోగా పంచ్‌ల మీద పంచ్‌లు కొడుతున్నారు. బ్లాక్ బెల్టుస్థాయికి ఎదిగి, పలుచోట్ల నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొని బహుమతులు సాధిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే స్థాయికి వెళ్లి పతకాల పంట పండిస్తున్నారు. అటు చదువులోనూ, ఇటు కరాటేలోనూ రాణిస్తూ ప్రతిభ చాటుతున్నారు. కరాటే నేర్చుకోవటం వల్ల ఆత్మస్థైర్యం పెంపొందించుకుంటున్నారు. మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు. ఈ తరహాలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు చోట్ల శిక్షణలు కొనసాగుతున్నాయి. అయితే ఆడపిల్లలు ఇలాంటి శిక్షణ పొందటం ద్వారా తమలోని బిడియాన్ని పోగొట్టుకుని నలుగురితో కలిసి మాట్లాడటం, జట్టుకృత్యాలు చేయటం వంటి వాటిలో చురుగ్గా పాల్గొంటారు.

తల్లిదండ్రుల్లోనూ ఆసక్తి

ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న హింస, చోటుచేసుకుంటున్న వివిధ సంఘటనలు, వారి ఆత్మరక్షణ నిమిత్తం ఆడపిల్లలకు కరాటే నేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. అమ్మాయిల ఆత్మరక్షణకు ఈ క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందని భావించి శిక్షణ ఇప్పిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించే పోటీలకు పంపిస్తున్నారు. చిన్నారులు కూడా పట్టుదలతో సాధన చేసి పోటీల్లో బహుమతులు సాధిస్తున్నారు. ఎందరో విద్యార్థులు దీనిలో ప్రావీణ్యం సంపాదించటానికి ముందుకొస్తున్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

కరాటే, కుంగ్‌ఫూ, జూడో, కర్రసాము నేర్చుకోవటం ద్వారా ఆడపిల్లలు తమను తాము స్వీయతరహాలో ఆత్మరక్షణ చేసుకోవచ్చు. కరాటే నేర్చుకోవటం వల్ల తమను తాము చాలా సులువుగా కాపాడుకోవచ్చు. పంచ్ చేయడం, కిక్ చేయడం ద్వారా డిఫెన్స్ చేసుకోగలరు. సమాజంలో ఎదురయ్యే అఘాయిత్యాలను ధైర్యంగా ఎదుర్కోవచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా చిన్నప్పటి నుంచి వీటిలో శిక్షణ ఇప్పించాలి. అత్యవసర సమయాల్లో వారికి ఇదొక ఆయుధంగా ఉపకరిస్తాయి. ఇతరుల నుంచి తమను తాము కాపాడుకోవటానికి దోహదపడతాయి. శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ విద్య నేర్చుకోవటం వల్ల తమలో దాగున్న బలం, ఫిట్నెస్, సమన్వయం, సమతుల్యత, క్రియాశీలత, ఏకాగ్రత, స్వీయ నియంత్రణ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చు. అలాగే ఒత్తిడి తగ్గించుకోవచ్చు. దీని ద్వారా ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం పెరుగుతుంది. మానసిక ఒత్తిడి దూరమవుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. శారీరక దృఢత్వం పెంపొందుతుంది. ఆత్మస్థైర్యం అలవడుతుంది. శరీరం ధడంగా మారుతుంది. మానసిక ప్రశాంతత పెరుగుతుంది. గుండె ఆరోగ్యంగా కూడా మెరుగుపడుతుంది. శరీరంలోని అన్ని భాగాల్లో కదలిక ఉంటుంది. తద్వారా రక్త ప్రసరణ కూడా బాగా పెరుగుతుంది. ఆత్మరక్షణతోపాటుగా ఆరోగ్యాన్ని కూడా పెంపొందించుకోవచ్చు.

దాడుల సమయంలో ఇలాచేయాలి

ఎవరైనా హఠాత్తుగా మీదకు వస్తే ముందుగా షోల్డర్ వద్ద అరచేయి ఉంచి గట్టిగా మోదాలి. ఆ తర్వాత మెడపట్టుకుని పక్కకు వంచేయాలి. అప్పటికీ ఆగకపోతే కాలితో చేయి షోల్డర్ వద్ద కాలితో తన్నాలి. ఇంకా అదే పరిస్థితి ఉంటే పంచ్‌లు, కిక్‌లు ఉపయోగించాలి. తద్వారా పొట్టభాగంలో కూడా కొట్టడం ద్వారా దాడి తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఎక్కువగా పంచ్‌లు, కిక్‌లు, కాళ్లతో తన్నడం, త్రోయింగ్, స్ట్రైయిక్‌ల ద్వారా అవతలి వ్యక్తిని మట్టికరిపించొచ్చు.

- యడవల్లి శ్రీనివాసరావు

ఆత్మవిశ్వాసం పెరిగింది

గతంలో నేను ఎంతో భయపడే దాన్ని. ఇప్పుడు కరాటేలో శిక్షణ తీసు కోవటం ద్వారా నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆటలు, పాటలు, చదువులో ఇలా అన్ని విషయాల్లో బాగా యాక్టివ్‌గా ఉంటున్నా. కరాటే నేర్చుకుంటే స్వీయరక్షణను పెంపొందించుకుంటారు. బిడియాన్ని విడిచిపెట్టి అందరితో సమైక్యభావంతో మెలగొచ్చు. అనుకోకుండా దాడులు జరిగే సమయంలో మనం ఏ విధంగా సంమయనంతో సన్నద్ధం కావాలి. ఎలా రక్షణ పొందాలనేది పూర్తిగా నేర్చుకున్నా.

పి.ప్రవర్ష

ఏదైనా సాధించగలననే నమ్మకం



ఈరోజుల్లో ఆడపిల్లలకు రక్షణ లేని పరిస్థితులు చూస్తున్నాం. అలాంటి తరుణంలో ఈ కరాటే శిక్షణ ద్వారా మా అందరిలోనూ ఆత్మవిశ్వాసంతో పాటు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనగలమనే దృఢ సంకల్పం ఏర్పడింది. దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనటమే కాకుండా పంచ్‌లతో మట్టి కరిపించే శక్తిని పెంపొందించు కున్నాం.

జి.లావణ్య

స్వీయరక్షణకు ప్రాధాన్యం

కరాటేలో ఎలాంటి ఆయుధం లేకుండా ఒట్టి చేతులతో స్వీయ రక్షణ పొందొచ్చు. వీటిలో స్ట్రైయిక్, త్రోయింగ్, పంచెస్, కిక్స్ వంటి మూవెంట్స్ నేర్పించాం. దాడి చేసే ఎదుట వ్యక్తిని మట్టికరిపించటానికి వీటిని సందర్భాను సారంగా వాడుతుంటారు. ఇంకా పోటీల విషయానికొస్తే కటా, కుమితే విభాగాల్లో ఉంటాయి. కటా విభాగంలో వయస్సు, బెల్ట్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు. కుమితే విభాగంలో ఫైట్ చేస్తారు. దీనికి వెయిట్, వయస్సును బట్టి చూస్తారు. మా విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సైతం మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

-సిహెచ్ మహేష్,
బ్లాక్‌బెల్ట్ 5వ డాన్,
కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కెఎఐ)

లెబనాన్‌లో మరోసారి పేలుళ్లు

- **ఈసారి వాకీటాకీల పేలుళ్లలో 14మంది మృతి, 450కు పైగా గాయాలు**

బీరుట్ : లెబనాన్‌లో బుధవారం మరోసారి పేలుళ్లు సంభవించాయి. ఈసారి వాకీటాకీల వంతు. దేశవ్యాప్తంగా హెజ్బుల్లాకు గట్టి పట్టు వున్న ప్రాంతాల్లో బుధవారం వాకీ టాకీలు పేలడంతో 14మంది మరణించగా.. 450మందికిపైగా గాయపడ్డారు. పేజర్ల పేలుడుతో పెను విధ్వంసం సృష్టించిన మరునాడే ఈ సంఘటన చోటు చేసుకుంది. అయితే ఎన్ని వాకీటాకీలు పేలాయనేది వెంటనే తెలియరాలేదు. హెజ్బుల్లా సభ్యులు ఉపయోగించేవే ఈ వాకీటాకీలన్నీ. బీరుట్ దక్షిణ శివార్లలో అనేక వాకీటాకీలు పేలాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ ప్రాంతంలోని రెండు కార్లలలో వుంచిన పరికరాల్లో కూడా పేలుళ్లు సంభవించాయని ఆ వర్గాలు చెప్పాయి. తూర్పు లెబనాన్‌లో వివిధ ప్రాంతాల్లో ల్యాండ్‌లైన్ టెలిఫోన్లు కూడా పేలుతున్నట్లు వార్తలందుతున్నాయి. పేజర్ల దాడిలో మరణించిన వారి అంత్యక్రియలు జరిగే ప్రాంతంలో కూడా పలు పేలుళ్లు చోటు చేసుకున్నాయని మీడియా వార్తలు తెలిపాయి. పేజర్లు కొనుగోలు చేసిన సమయంలోనే ఈ చేతుల్లో పట్టే వైర్‌లెస్ వాకీటాకీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా, ఇజ్రాయల్ శతఘ్ని స్థావరాలపై తాము రాకెట్లతో దాడి చేసినట్లు హెజ్బుల్లా తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో మధ్య ప్రాచ్యంలో యుద్ధం విస్తరించే అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి. విదేశీ గడ్డపై అత్యాధునికి ఆపరేషన్లు చేపట్టిన సుదీర్ఘ చరిత్ర వున్న ఇజ్రాయిల్ నిఘా సంస్థ మొసాద్, హెజ్బుల్లా పేజర్లను దిగుమతి చేసుకోవడానికి చాలా నెలలు ముందుగానే పేజర్లలో పేలుడు పదార్ధాలు పెట్టిందని లెబనాన్ సీనియర్ భద్రతా అధికారి పేర్కొన్నారు.

ఆ పేజర్లు మేం తయారు చేయలేదు !
తైవాన్ గోల్డ్ అపోలో కంపెనీ

లెబనాన్‌వ్యాప్తంగా మంగళవారం పేజర్లు పేలిన ఘటనలో తమ కంపెనీ పాత్ర వుందనడాన్ని తైవాన్ కంపెనీ గోల్డ్ అపోలో ఖండించింది. పేలుడు పదార్ధాలు వుంచిన పేజర్లనే తాము సరఫరా చేశామనడాన్ని తిరస్కరించింది. ఆ పేజర్ల వెనుక తైవాన్ కంపెనీ బ్రాండ్ ముద్రించి వుంది. దీనిపై బుధవారం కంపెనీ వివరణ ఇచ్చింది. లెబనాన్‌లో మూకుమ్మడిగా పేలిన ఎఆర్–924 మోడల్ పేజర్లను తాము తయారుచేశామనడాన్ని తిరస్కరించింది. లైసెన్స్ ఒప్పందం ద్వారా వాటిని బిఎసి యురోపియన్ కంపెనీ తయారుచేసిందని వెల్లడించింది. "ఒప్పందం ప్రకారం, నిర్దిష్ట ప్రాంతాల్లో ఉత్పత్తి అమ్మకాలకు మా ట్రేడ్‌మార్క్ బ్రాండ్‌ను ఉపయోగించుకోవడానికి బిఎసికి మేం అనుమతిచ్చాం. ఈ ఉత్పత్తి రూపకల్పన,తయారీ అంతా కూడా బిఎసినే చూసుకుంది." అని గోల్డ్ అపోలో ఒక ప్రకటనలో పేర్కొంది. కేవలం బ్రాండ్ ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించడానికి మాత్రమే తాము అనుమతిని మంజూరు చేశామని తెలిపింది. అంతేకానీ ఈ ఉత్పత్తి తయారీలో తమకెలాంటి పాత్ర లేదని స్పష్టం చేసింది. లెబనాన్‌కు నేరుగా పేజర్లు ఎగుమతి చేసిన రికార్డు తమకు లేదని తైవాన్ ఆర్థిక వ్యవహారాల శాఖ వెల్లడించింది. బహుశా తయారైన తర్వాత ఆ పేజర్లు మార్పునకు గురి కావచ్చునని పేర్కొంది. తైవాన్ విదేశాంగ శాఖ వెంటనే దీనిపై ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. పేలుళ్ళకు ముందు పేజర్లలో కొద్దిమొత్తాల్లో పేలుడు పదార్థాలను ఇజ్రాయిల్ అధికారులు పెట్టి వుండవచ్చని పేరు వెల్లడించని అధికారులను ఉటంకిస్తూ మీడియా వార్తలు పేర్కొన్నాయి. ఇజ్రాయిల్ కూడా దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

గాజాకు మా మద్దతు కొనసాగుతుంది : హిజ్బుల్లా
12కి పెరిగిన మృతులు

గాజా ప్రజలకు మద్దతుగా, ఇజ్రాయిల్ దాడులను ప్రతిఘటిస్తూ తమ ఆపరేషన్లు కొనసాగుతాయని హిజ్బుల్లా స్పష్టం చేసింది. ఈ దాడులకు ఇజ్రాయిల్‌దే పూర్తి బాధ్యత అని తేల్చి చెప్పింది. లెబనాన్‌వ్యాప్తంగా మంగళవారం చోటు చేసుకున్న దాడుల్లో మృతుల సంఖ్య 12కి పెరిగింది. మూడు వేల మందికి పైగా గాయపడ్డారు. పొరుగున గల సిరియాలో కూడా అనేక మంది గాయపడ్డారు. ఈపేలుళ్లపై వ్యాఖ్యా నించడానికి ఇజ్రాయిల్ తిరస్కరించింది.

వారి క్రూరత్వానికి ఇదొక రుజువు:
ఇరాన్, సిరియా వ్యాఖ్య

యూదు దేశం చేసే నేరాలకు అమెరికా మద్దతిస్తోందని ఈ సంఘటనతో మరోసారి రుజువైందనిటిరాన్ అధ్యక్షుడు పెజెషికాన్ వ్యాఖ్యానించారు. లెబనాన్‌లో పేజర్ పేలుళ్ళ నేపథ్యంలో ఇజ్రాయిల్ చర్యలకు అమెరికా దాని మిత్రపక్షాలు సమద్దతివ్వడాన్ని తీవ్రంగా విమర్శించారు. గాజాలో కాల్పుల విరమణ కు మద్దతిస్తామని అమెరికా, మిత్రపక్షాలు పైకి చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం యూదుదుర హంకార ప్రభుత్వం చేసే నేరాలు, ఊచకోతలు, గుడ్డిగా చేసే హత్యలకు పూర్తి స్థాయిలో మద్దతిస్తున్నారని కేబినెట్ సమావేశంలో ఆయన వ్యాఖ్యానించారు. లెబనాన్‌లో జరిగిన పేలుళ్ళు పశ్చిమ దేశాలకు ముఖ్యంగా అమెరికాకు సిగ్గుచేటని విమర్శించారు. తమ అమానవీయ లక్ష్యాల కోసం ఎంతకైనా తెగిస్తారని దీనితో రుజవవుతోందన్నారు. మానవ సంక్షేమం కోసం ఉద్దేశించిన పరికరాలను తీవ్రవాద కార్యకలాపాల కోసం వినియోగించడం వారి నేరాల క్రూరత్వాన్ని తెలియచేస్తోందన్నారు.

రోహిత్, గంభీర్‌లకు పరీక్ష

- **సర్ఫరాజ్, జురెల్ బెంచ్‌కే పరిమితం**
- **నేటినుంచి బంగ్లాదేశ్‌తో తొలిటెస్ట్**
- **ఉదయం 9.30గం॥ల నుంచి**

చెన్నై: బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. ఎంఎ చిదంబరం స్టేడియం వేదికగా భారత్–బంగ్లాదేశ్ జట్ల మధ్య గురువారం నుంచి తొలి టెస్ట్ జరగనుంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం పిచ్ స్పిన్నర్లకు స్వర్గధామం కావడంతో హెడ్‌కోచ్ గౌతం గంభీర్ తెరదించాడు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆపద్బాంధవులుగా నిలిచిన అరంగేట్రం హీరోలు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లు బెంచ్ మీదనే ఉంటారని చెప్పాడు. 'మేము ఎవ్వరిపై వేటు వేయడం లేదు. అయితే.. తుది జట్టులో అవసరమైన వాళ్లనే తీసుకుంటున్నాం. రిషభ్ పంత్ గైర్హాజరీలో ధ్రువ్ జురెల్ అద్భుతంగా రాణించాడు. కానీ, కొన్నిసార్లు ఆటగాళ్లు వేచి చూడక తప్పదు. సర్ఫరాజ్ ఖాన్ పరిస్థితి కూడా అంతే. వీళ్లకు భవిష్యత్‌లో కచ్చితంగా అవకాశాలు ఇస్తాం. కాకపోతే కొంచెం ఓపిక పట్టాల్సి ఉంటుంది' అని గంభీర్ వెల్లడించాడు. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో మూడోసారి ఫైనల్ రేసులో ముందున్న భారత జట్టు బంగ్లాదేశ్ సిరీస్‌ను సీరియస్‌గా తీసుకుంటోంది. అందుకనే జట్టు కూర్పులో యాజమాన్యం కుర్రాళ్ల కంటే అనుభవజ్ఞులకే పెద్ద పీట వేస్తోంది. కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లు రీ ఎంట్రీ ఇవ్వడంతో సర్ఫరాజ్, జురెల్‌లకు తుది జట్టులో స్థానం దక్కడం అనుమానమే అని అంతా అనుకున్నారు. బంగ్లా సిరీస్ కోసం నెట్స్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చిన కెప్టెన్ రోహిత్ శర్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతిభగల కుర్రాళ్లతో భారత బెంజ్ బలంగా ఉందని చెప్పాడు. రాహుల్, పంత్‌లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం చూస్తుంటే కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్‌లు నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనను దృష్టిలో పెట్టుకొని ఈ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

జట్లు(అంచనా)...

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, కుల్దీప్ యాదవ్, సిరాజ్, బుమ్రా.

బంగ్లాదేశ్: నజ్ముల్(కెప్టెన్), షాద్మాన్, జకీర్ హసన్, మోమినుల్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్, లింటన్ దాస్(వికెట్ కీపర్), మెహిదీ హసన్, తైజుల్ ఇస్లామ్, తస్కిన్ అహ్మద్, నహిద్ రానా.

చంద్రుడి చరిత్ర చెప్పే సాక్ష్యాధారాలు !

- **చాంగ్–6 మిషన్ నమూనాలపై పరిశోధనా పత్రం ప్రచురించిన చైనా శాస్త్రవేత్తలు**

బీజింగ్ : చాంగ్–6 మిషన్ చంద్రునిపై నుండి భూమికి తీసుకువచ్చిన నమూనాల స్వభావంపై మొదటి పరిశోధనా పత్రాన్ని పలు చైనా సంస్థలతో కూడిన సంయుక్త పరిశోధనా బృందం నేషనల్ సైన్స్ రివ్యూ జర్నల్‌లో మంగళవారం ప్రచురించింది. చంద్రుని ఆవలవైపుపై అధ్యయనానికి సంబంధించి చారిత్రక అంతరాన్ని ఈ పరిశోధనా పత్రం భర్తీ చేసింది. అంతేగాకుండా తొలినాళ్ళ పరిణామాలపై పరిశోధన చేయడానికి ప్రత్యక్ష సాక్ష్యాధారాలను అందచేసింది. ఆ నమూనాల భౌతిక, రసాయన, ఖనిజ సంబంధిత లక్షణాలపై పత్రం సుదీర్ఘంగా చర్చించింది. ఇప్పటి వరకు చంద్రునిపై నుండి ఆరు అమెరికా అపోలో మిషన్లు, పూర్వపు సోవియట్ యూనియన్‌కి చెందిన మూడు మిషన్లు, చైనా చాంగ్–5 మిషన్ ద్వారా 380కిలోల నమూనాలను తీసుకురాగా, అవన్నీ కూడా చంద్రునిలో మనకు కనిపించే భూభాగం నుండి తీసుకువచ్చినవే. కాగా చాంగ్–6 మిషన్ మాత్రం మానవాళి చరిత్రలో మొదటిసారిగా చంద్రుని ఆవలవైపునుండి విజయవంతంగా నమూనాలను తీసుకు వచ్చింది. 1935.3 గ్రాముల విలువైన పదార్ధాలను భూమికి తెచ్చింది. చంద్రుని ప్రాచీన కాలపు చరిత్రను తెలుసుకోవడానికి ఈ నమూనాలు బాగా ఉపకరిస్తాయని భావిస్తున్నారు. చంద్రుని అంతర్భాగాల గురించి, అలాగే అక్కడి అగ్నిపర్వతాల పేలుళ్ళపై కీలక సమాచారం లభ్యమవుతుందని, చంద్రునిపై గల రెండు ప్రాంతాల మధ్య గల తేడాలపై దృష్టి సారించడానికి కూడా ఉపకరిస్తుందని భావిస్తున్నారు.



యువ క్రికెటర్లకు పెద్దపీట

హైదర్, ఖాతూన్, రుమానాలపై వేటు

ఢాకా: మహిళల టి20 ప్రపంచ కప్ కోసం బంగ్లాదేశ్ జట్టును ప్రకటించింది. ఆసియా కప్‌లో జట్టును నడిపించిన నిగర్ సుల్తానా కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బిసిబి) ఎంపిక చేసింది. ఈసారి యువ రక్తంతో కూడిన జట్టును యుఎఇకి పంపాలని బోర్డు సెలెక్టర్లు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే వెటరన్ ఆల్‌రౌండర్ రుమనా అహ్మద్‌కు షాకిచ్చారు. జట్టు ఎంపికపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సభ్యులు, సెలెక్టర్లు ఈసారి పెద్ద కసరత్తు చేశారు. ఫామ్ లేమితో జట్టుకు భారంగా మారిన సీనియర్లకు చెక్ పెట్టారు. ఈ ఏడాది మహిళల ఆసియా కప్‌లో విఫలమైన రుబే హైదర్, షరిఫా ఖాతూన్, సబికున్ నహర్, ఇష్మా తంజీమ్‌లపై వేటు వేశారు. అన్‌క్యాప్డ్ ప్లేయర్లు తాజ్ నెహర్, దిశా బిస్వాల్‌లను తొలిసారి వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. మరోవైపు.. శాంతి రాణి, ఫాహిమ ఖాతూన్, శోభన మోస్త్రేలకు మరో అవకాశం ఇచ్చారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా అక్టోబర్ 3నుంచి మహిళల టి20 ప్రపంచ కప్ మొదలవ్వనుంది. లీగ్ దశలో బంగ్లా తొలుత స్కాట్లాండ్‌ను ఢీ కొట్టనుంది. అనంతరం ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా వంటి బలమైన ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. ఇప్పటివరకూ మోగా టోర్నీ చరిత్రలో బంగ్లాదేశ్ సెమీస్ ఆడిన దాఖలాలు లేవు.

బంగ్లాదేశ్ జట్టు: **నిగర్ సుల్తానా, నహిద అక్తర్, ముర్షిదా ఖాతున్, షోర్నా అక్తర్, రీతూ మోనీ, శోభన మోస్త్రే, రబెయ ఖాన్, సుల్తాన ఖాతున్, ఫాహిమా ఖాతున్, మరుఫా అక్తర్, జహనార అలామ్, దిలరా అక్తర్, తాజ్ నెహర్, శాంతి రాణి, దిషా బిస్వాస్.**

ఒలింపిక్ పతక విజేతకు మాల్విక‌ చెక్

చైనా బ్యాడ్మింటన్ ప్రి క్వార్టర్స్‌కు చేరిక

హాంగ్జౌ(చైనా): భారత యువ మహిళా షట్లర్ మాల్విక బన్సోద్ సంచలనం నమోదు చేసింది. చైనా ఓపెన్ రౌండ్–32తో ఒలింపిక్ పతక విజేత గ్రెగోరియా మరిస్కాను ఓడించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 22ఏళ్ల మాల్విక 26–22, 21–19తో వరుససెట్లలో ఈ మ్యాచ్‌ను ముగించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ సుమారు 46నిమిషాల సేపు సాగింది. మాల్విక కెరీర్‌లో ఇది ఒక అద్భుత మ్యాచ్. ప్రి క్వార్టర్స్‌లో మాల్విక స్కాట్లాండ్‌కు చెందిన క్రిస్టీ గిల్మర్‌తో తలపడనుంది. ఆకర్షి కశ్యప్, ఇమాద్ ఫారూఖీ తొలిరౌండ్‌లోనే నిష్క్రమించగా.. ఈ టోర్నీలో నిలిచిన ఏకైక మహిళా షట్లర్ మాల్విక మాత్రమే. ఆకర్షి కశ్యప్ 15–21, 19–21తో చైనీస్ తైపీకి చెందిన పిన్–చియాన్ చేతిలో, ఇమాద్ ఫారూఖీ 9–21, 7–21తో గిల్మర్ చేతిలోట్రీసా జోలీ–గాయత్రీ జంట 21–16, 15–21, 17–21తో చైనీస్ తైపీ జంట చేతిలో పోరాడి ఓడారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68